
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 19 ఏప్రిల్ 2024


సోమశిలలో 8.500 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఏప్రిల్ 18: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారానికి ప్రాజెక్టులో 8.500 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 15, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఇప్పటికే అనేక వర్గాలను తమ రాజకీయ స్వలాభం కోసం వినియోగించుకున్న వైసీపీ, ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థను కూడా అంతకుమించిన రీతిలో ఉపయోగించుకుంటోంది. ఎన్నికల ముందు వరకూ ప్రజలకు పారదర్శక సేవలు అందించేందుకు వలంటీర్లను నియమించామని చెబుతూ వచ్చిన ఆ పార్టీ నేతల అసలు వ్యూహం ఎన్నికల కోడ్ వచ్చాక బయటపడుతోంది. అటు వలంటీర్లను, ఇటు ప్రజలను చేసిన మోసం తేటతెల్లమవుతోంది. నిరుద్యోగుల జీవితాలను రాజకీయ ఆటలో బలిచేసి ఎన్నికల్లో గెలవాలన్న కుట్రలకు తెరలేపింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక భారీగా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి రాజకీయ ప్రచారాల్లో ఉపయోగించుకుంటుండడమే ఇందుకు నిదర్శనం. సంక్షేమ పథకాలను పేదలకు అందించే క్రమంలో లబ్ధిదారులకు, వలంటీర్లకు మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ సంబంధాలను ఉపయోగించుకొని వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను భయపెట్టో, బెదిరించో ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ముసుగు తొలగింది!



- రాజకీయ కూలీలుగా వలంటీర్లు
- బయట పడుతున్న వైసీపీ వ్యూహం
- ఎన్నికల కోసమే వాళ్లతో గొడ్డు చాకిరీ
- నేడు బలవంతంగా రాజీనామా చేయిస్తున్న నేతలు
- ఇప్పటికి 2,542 మంది రిజైన్

నెల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా వలంటీర్ల రాజీనామాలు భారీగా కొనసాగుతున్నాయి. రోజు రోజుకూ రాజీనామా చేసేవారి సంఖ్య పెరుగుతోంది. కొంత మంది వైసీపీ సేవలో తరించేందుకు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తుండగా, మరికొంత మంది చేత మాత్రం వైసీపీ నాయకులు బలవంతంగా చేయిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ నాటికి అంటే ఎన్నికల నోటిఫికేషన్ ముందు రోజు వరకు 2,542 మంది వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. ఒక్క 16వ తేదీనే 349 మంది రాజీనామా చేయగా 17వ తేదీన మరో 99 మంది రాజీనామా చేయడం గమనార్హం. వీరికి అదనంగా మరో 27 మంది వలంటీర్లను అధికారులే తొలగించారు. వీరంతా రాజకీయ ప్రచారాల్లో పాల్గొనడమే కారణం. దీంతో మొత్తంగా ఎన్నికల కోడ్ వచ్చిన నెల రోజుల్లో 2,569 మంది వలంటీర్లు ఉద్యోగాలు వదిలేశారు. అత్యధికంగా కావలి అర్బన్‌లో 438 మంది, నెల్లూరు అర్బన్‌లో 223 మంది, విడవలూరులో 171, కొడవలూరులో 156, ఇందుకూరుపేటలో 192, దగదర్తిలో 112, బుచ్చిలో 146, కోవూరులో 156, రాపూరులో 87, ముత్తుకూరులో 91, వెంకటాచలం మండలంలో 95 మంది, ఆత్మకూరు రూరల్‌లో 104, ఆత్మకూరు అర్బన్‌లో 45, చేజర్లలో 70, పొదలకూరులో 90 చొప్పున రాజీనామాలు చేశారు. ఇంకా చాలా మంది రాజీనామాలు చేసి ఉన్నారు. ఆ దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి.

● అనుచరగణం ఉన్నా..

అధికార పార్టీ నేతలకు ఎంత అనుచరగణమున్నా, ఎన్ని ఆర్థిక వనరులున్నా ఎన్నికల్లో మాత్రం ప్రధానంగా వలంటీర్లపైనే ఆధారపడుతున్నారు. గ్రామ, వార్డుల పరిధిలో వలంటీర్లకున్న విస్తృత పరిచయాలు, ప్రభావం ఇతరులకు వుండడం లేదు. ప్రతి యాభై ఇళ్లకు ఒక వలంటీరు అందుబాటులో వుండడం, ఆ యాభై కుటుంబాలను తరచూ కలుస్తూ వుండడం, ప్రభుత్వ పథకాల లబ్ధిని అందజేస్తుండడం, ఇతరత్రా ప్రభుత్వ పనులకు కూడా జనం వారిపై ఆధారపడుతుండడం దీనికి కారణం. దీంతో ఏ కుటుంబం పరిస్థితి ఏమిటి? ఏ కులం లేదా ఏ మతం? ఎంతమంది ఓటర్లున్నారు? వారిలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నది ఎంతమంది? వారి నేపథ్యం? ఏ పార్టీకి సానుభూతిపరులు? వంటి సమాచారం వలంటీర్ల నుంచే రాబడుతున్నారు. వీటన్నింటికీ మించి ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులను, పార్టీ నేతలను కూడా వలంటీర్లే ప్రజలకు పరిచయం చేయాల్సిన పరిస్థితి. దీనికి మించి వంపకాలకు వలంటీర్లను మించిన నమ్మకమైన ప్రత్యామ్నాయం అధికార పార్టీ నేతలకు మరొకరు దొరకడం లేదు. ఈ అంశాలను దృష్టిలో వుంచుకుని అధికార పార్టీ నేతలు వలంటీర్లపైనే భారం వేస్తున్నారు. ఆ పనులు స్వేచ్ఛగా, నిరాటంకంగా జరగడం కోసం రాజీనామాలకు ఒత్తిడి తెస్తున్నారు. అయితే మరికొందరు వలంటీర్లు మాత్రం రాజీనామాలు చేసేందుకు ససేమిరా అంటున్నారు.

వలంటీరు ఉద్యోగానికి రూ.5 వేలు వేతనంగా నిర్ణయించినా అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. దానిని బట్టి నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వలంటీర్లుగా కొంతమంది వైసీపీ కార్యకర్తలను చేర్చగా మరికొంత మంది సామాన్య పేదలున్నారు. అయితే వైసీపీ అసలు వ్యూహం వలంటీర్లను ఎన్నికల సమయంలో ఉపయోగించుకోడమేనని మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. కానీ ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించడంతో వైసీపీ వ్యూహం బెడిసికొట్టింది. అయినా మరో అడ్డదారిలో వలంటీర్ల సేవలను ఉపయోగించుకునేందుకు వారి చేత బలవంతంగా

● నిరుద్యోగులతో ఆటలు

రాజీనామాలు చేయిస్తున్నారు. వారిని తమ ప్రచార కార్యక్రమాల్లో తిప్పుకుంటూ పేదలకు వల వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. రాజకీయాల్లోకి తమను లాగొద్దని చాలా మంది వలంటీర్లు వేడుకుంటున్నా వారికి బెదిరింపులు ఎక్కువవుతున్నాయి. దీంతో ప్రశాంతంగా బతికే తాము స్థానికంగా ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు శత్రువులుగా మారిపోతున్నామంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి శబరి శ్రీరామక్షేత్రం బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 : నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రంలో కొలువైయున్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి మొదలవుతాయి. ఈ నెల 27వతేదీ వరకు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయం పునఃనిర్మాణ ధర్మకర్త చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20వతేదీ రాత్రి అంకురార్పణ, 21 ఉదయం ధ్వజా రోహణ, హోమం, రాత్రి శేషవాహనంపై నగరోత్సవం, 22 ఉదయం హోమం, తిరుమంజనం, రాత్రి హనుమంతసేవ జరుగుతాయని తెలిపారు. 24 ఉదయం హోమం, మోహినీ ఉత్సవం, రాత్రి గరుడసేవ, గ్రామోత్సవం, 25 హోమం, తిరుమంజనం, రాత్రి సీతారాముల కల్యాణం, రాత్రి గజవాహన సేవ, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 26 ఉదయం హోమం, బలిహరణం, సాయంత్రం శ్రీరామకోటి స్థూపం ప్రాంగణంలో పారువేట ఉత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. 27వతేదీ రాత్రి పుష్పయాగం, పల్లకీసేవ, హారతులతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.



భక్తులకు దర్శనం ఇస్తున్న విష్వక్సేనులవారు

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు వైభవంగా అంకురార్పణ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 : నగరంలోని మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, సమస్త దేవతారాధన, మృత్సంగ్రహణం, హోమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళి రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, రాత్రికి శేషవాహన సేవ, నగరోత్సవం జరుగుతాయని తెలిపారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో వీ గిరికృష్ణ పర్యవేక్షించారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం

డిప్యుటేషన్లపై చర్యలేవి ?

- వైద్యాధికారుల మౌనం
- నేడు డీఎంహెచ్‌వోలతో ప్రిన్సిపల్ సెక్రటరీ సమావేశం

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 18: వైద్యఆరోగ్యశాఖలో డిప్యుటేషన్‌ల రగడ కొనసాగుతూనే ఉంది. ఇష్టారాజ్యంగా వైద్యులను, ఉద్యోగులను మార్చిన అధికారులకు, ఆయా డిప్యుటేషన్ల రద్దు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరి కృష్ణబాబు నుంచి ఉత్తర్వులు అందాయి. అయితే ఆ ఉత్తర్వులను జిల్లాలోని వైద్యాధికారులకు పంపిన డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య డిప్యుటేషన్‌లో ఉన్న వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై వైద్య ఆరోగ్యశాఖలో తీవ్రంగా చర్చ జరుగుతుంది.

● నేడు సమావేశం

ఈ క్రమంలో శుక్రవారం విజయవాడలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాష్ట్రంలోని డీఎంహెచ్‌వోలతో సమావేశం నిర్వహించనున్నారు. డిప్యుటేషన్‌లపైనే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే జిల్లాలో డిప్యుటేషన్‌లో ఉన్న వారిలో ఎక్కువమంది విధులకు డుమ్మా కొట్టి తమ స్వంత పనులకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వైద్యులయితే ఏదో మొక్కుబడిగా డీఎంహెచ్‌వో కార్యాలయానికి వస్తున్నట్లు ఉద్యోగ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు ఈ డిప్యుటేషన్‌లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చేడాల్సి ఉంది.



కోవూరులో ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

సమరం ఆరంభం!

● ఎన్నికల నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్ల స్వీకరణ

నెల్లూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి తెరలేచింది. కీలక సమరం ఆరంభమైంది. ఎన్నికల నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారులు గురువారం విడుదల చేశారు. ఉదయం 10:30 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేయగా 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. నెల్లూరు పార్లమెంటుతోపాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు ఆయా కార్యాలయాల్లో కూర్చున్నారు. పటిష్ట భద్రత మధ్య తొలిరోజు నామినేషన్ల స్వీకరణ మొదలైంది. మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. తొలి రోజు మంచి ముహూర్తాలు ఉండడంతో ఎక్కువ మంది నామినేషన్లు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. మధ్యాహ్నం 12.30 గంటల్లోపే దాదాపుగా అభ్యర్థులందరూ నామినేషన్లను ఆర్‌వోలకు అందజేశారు. 8 అసెంబ్లీ నియోజకవర్గాలకుగానూ ఐదింటికి తొలిరోజు నామినేషన్లు దాఖలయ్యాయి. కోవూరులో ప్రధాన పోటీదారులైన టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలు నామినేషన్లు వేశారు. ప్రసన్నకు డమ్మీగా ఆయన కుమారుడు రజత్‌కుమార్‌రెడ్డి కూడా నామినేషన్ దాఖలు చేశారు. కావలిలో వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఆయనకు డమ్మీగా రామిరెడ్డి ఆదిలక్ష్మి కూడా నామినేషన్ వేశారు. నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తరఫున మాజీ మేయర్ ఎస్.భానుశ్రీ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరిలలోనూ నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇక నెల్లూరు పార్లమెంటు స్థానానికి తొలిరోజు ఒక నామినేషన్ దాఖలైంది. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) తరఫున ఎస్‌కే మాబు నామినేషన్ వేశారు. మొత్తంగా తొలి రోజు ఒక పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పది మంది అభ్యర్థులు 15 సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారులకు అందజేయడం విశేషం. కాగా నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రానికి వంద మీటర్ల దూరంలో భారీకేడ్లు ఏర్పాటు చేశారు. ఈ పరిధిలోకి నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు ఐదుగేనిరి మించి అనుమతించడం లేదు.

తొలిరోజు దాఖలైన నామినేషన్లు

నియోజకవర్గం	అభ్యర్థి	పార్టీ	సెట్లు
నెల్లూరు (ఎంపీ)	ఎస్‌కే మాబు	ఆర్పీఐ	1
కోవూరు	వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి	టీడీపీ	2
కోవూరు	నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి	వైసీపీ	2
కోవూరు	నల్లపురెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి	వైసీపీ	2
కావలి	రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి	వైసీపీ	2
కావలి	రామిరెడ్డి ఆదిలక్ష్మి	వైసీపీ	2
కావలి	గుంజి వెంకటేశ్వర్లు	బీఎస్పీ	1
నెల్లూరు రూరల్	కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి	టీడీపీ	1
ఆత్మకూరు	నెల్లూరు కృష్ణారెడ్డి	యుగతులసి పార్టీ	1
ఉదయగిరి	చెరుకూరి వేణుగోపాల్	స్వతంత్ర	1

ఏడు కేసుల్లో నిందితుడిగా రామిరెడ్డి ప్రతాప్

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : కావలి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై ఏడు కేసులున్నాయి. అందులో ఆరు కేసులు కల్తీ మద్యం పంపిణీ కేసులే కావడం గమనార్హం. ఈ కేసుల వివరాలను ఆయన తన నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2014 ఎన్నికలప్పుడు ఇతర రాష్ట్రాల్లో తయారు చేసిన కల్తీ మద్యాన్ని జిల్లాలో పంపిణీ చేశారని కేసులు నమోదయ్యాయి. నాసిరకమైన మద్యాన్ని తయారు చేయడం, వాటికి ప్రత్యేక లేబుళ్లు వేయడం, ఎలాంటి ఎక్సైజ్ డ్యూటీ చెల్లించకుండా ఎన్నికల సమయంలో పంపిణీ చేయడం వంటి అభియోగాలపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కావలి ఎక్సైజ్ స్టేషన్‌లో 2014-15లో క్రైమ్ నెంబర్లు (పీఆర్ నంబర్) 17, 19, 20, 21, 23, 24లతో ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ బాధ్యతలను అప్పటి ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. విచారణ పూర్తి చేసిన సీఐడీ కోర్టులో చార్జ్‌షీట్‌లు దాఖలు చేసింది. ప్రస్తుతం నెల్లూరులోని రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసులు విచారణలో ఉన్నాయి. మొదటి కేసులో రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఏ12గా, రెండో కేసులో ఏ9గా, మూడో కేసులో ఏ9గా, నాలుగో కేసులో ఏ9గా, ఐదో కేసులో ఏ12గా, ఆరో కేసులో ఏ11గా ఉన్నారు. వీటితోపాటు కావలి ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 49/2019గా నమోదైన కేసులో కూడా నిందితుడిగా ఉన్నారు. ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన కేసు కాగా, ఇది ప్రస్తుతం విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు విచారణలో ఉంది.

● ప్రతాప్ ఆస్తులు ఇవే...

ఇక ప్రతాప్‌కుమార్‌రెడ్డి కుటుంబ ఆస్తులు కూడా భారీగానే ఉన్నాయి. ఆయనకు రూ.94.67 కోట్ల చరాస్తులు, ఆయన సతీమణికి రూ.34.27 కోట్ల చరాస్తులు ఉన్నాయి. అలానే ప్రతాప్ కుమార్‌రెడ్డి పేరుపై రూ.72.02 కోట్ల స్థిరాస్తులు, ఆయన సతీమణి పేరుపై రూ.36 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే ప్రతాప్‌కుమా ర్‌రెడ్డికి రూ.40.14 కోట్ల అప్పులు, ఆయన సతీమణికి రూ.13.81 కోట్ల అప్పులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వివరించారు.

కోవూరు అభ్యర్థుల ఆస్తులు ఇవిగో...

కోవూరు, ఏప్రిల్ 18: కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డిలు ఎన్నికల అఫిడవిట్‌లో తమ ఆస్తుల వివరాలను పొందుపరచారు. తమపై ఎలాంటి కేసులు లేవని ప్రమాణపత్రంలో వారు పేర్కొన్నారు. ప్రశాంతిరెడ్డికి వివిధ బ్యాంకుల్లో రూ 46,94,59,995, తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి రూ.464,43,20,644 నగదు ఉన్నట్లు వివరించారు. ప్రశాంతిరెడ్డికి రూ.30,11,93,087 విలువ చేసే పొలాలు, భవనాలు ఉన్నట్లు చూపారు. ప్రభాకరరెడ్డికి రూ.174,83,48, 539 విలువ చేసే పొలాలు, భవనాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రశాంతిరెడ్డికి రూ.43,48,11,682 రుణాలు, వీపీఆర్‌కు రూ.153,81,50,921 రుణాలు ఉన్నట్లు వివరించారు. ప్రశాంతిరెడ్డికి రూ.6,52,372 విలువచేసే హోండా కారు ఉందని పేర్కొన్నారు. కాగా ఆమె తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు.

● ప్రసన్న ఆస్తుల వివరాలు..

ఇక వైసీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆస్తి రూ.1,05,41,523గా పేర్కొన్నారు. ఆయన భార్య గీతమ్మకు రూ.54,85,618, కుమారుడు రజిత్‌రెడ్డికి రూ.1,45,08,788, కోడలు పూజారెడ్డికి రూ.39,27,666 ఆస్తులు ఉన్నట్లు వివరించారు. ప్రసన్నకు రూ.9.6 కోట్లు విలువ చేసే పొలం, స్థలాలు, ఆయన భార్య గీతమ్మకు రూ.2.5కోట్లు, కుమారుడు రజిత్‌రెడ్డికి రూ. 3.3కోట్లు, కోడలు పూజారెడ్డికి రూ.1,72,40,000 విలువ చేసే పొలం, స్థలాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రసన్నకు రూ.1,87,66,272, కుమారుడు రజిత్‌రెడ్డికి రూ. 1,57,34,838 అప్పులు ఉన్నట్లు తెలిపారు. ప్రసన్నకు రూ.15 లక్షల విలువ చేసే మూడు కార్లు, కుమారుడు రజిత్‌రెడ్డికి రూ.7.5 లక్షలు విలువచేసే నాలుగు వాహనాలు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కాగా ప్రసన్నకుమార్ రెడ్డి బీఏ పట్టభద్రుడు.

కోవూరులో స్వల్ప ఉద్రిక్తత

కోవూరు : కోవూరు రిటర్నింగ్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు రావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దాదాపు ఒకే సమయంలో నామినేషన్ వేసేందుకు వచ్చారు. ఎన్నికల కార్యాలయం లోకి అనుమతించే విషయమై ఇరు పార్టీల నాయకుల మధ్య వివాదం చెలరేగింది. అయితే, పోలీసులు ఇరువర్గాలను పక్కకు నెట్టేశారు. ఇద్దరు టీడీపీ కార్యకర్తలను పోలీసులు లాఠీలతో కొట్టి పక్కకు నెట్టారు. మరోవైపు తమను ఎన్నికల కార్యాలయంలోనికి అనుమతించాలని కోరుతూ బీజేపీ జిల్లా నాయకుడు సురేంద్రరెడ్డి నాయకత్వంలో పలువురు కార్యకర్తలు సీఐ శ్రీనివాసరావును నిలదీశారు.



కోవూరులో లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులు

జన కేతనం

ప్రలోభాలకు గురి చేస్తున్నారా.. అయితే ఫోన్ చేయండి!

తక్షణమే చర్యలు తీసుకుంటాం!

పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు : ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూమ్‌లో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి నగరంలో వాహనాల తనిఖీల్లో పాల్గొన్న ఎస్పీ గురువారం ధర్గామిట్ట పోలీస్‌స్టేషన్ తనిఖీ, సెబ్ అధికారులతో సమావేశం, కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభించారు. పోలీసు కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు వివరాలను ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినా, ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరుగుతున్నా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా వెంటనే కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు. కంట్రోల్‌రూమ్ ఫోన్ నెంబర్లు 9440796385, 9392903413, 0861-2328400లకు నేరుగా ఫోన్‌చేసినా, ఫొటోలు పంపినా తక్షణమే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని 9వేల మందిని ముందస్తు బైండోవర్ చేశామన్నారు. మద్యం, నగదు అక్రమరవాణా, అనధికార విక్రయాలు, నిల్వలు, పంపిణీ పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 18 చెక్‌పోస్టులు, 26 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వై లెన్స్‌టీమ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.

మద్యం నిల్వలపై నిఘా

జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో సెబ్ అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నియమావళికి లోబడి విధులు నిర్వహించాలని హెచ్చరించారు. జిల్లాలో నాటుసారా, గంజాయి, మద్యం అక్రమ నిల్వలు, రవాణాను గుర్తించి ఆకస్మిక దాడులు నిర్వహించి సీజ్ చేయాలన్నారు. పొరుగు మద్యం జిల్లాలోకి రాకుండా చెక్‌పోస్టుల్లో క్షుణ్ణంగా తనిఖీ చేయడంతోపాటు సరిహద్దు స్టేషన్లలో గట్టిగా నిఘా ఉంచాలని ఆదేశించారు. స్థానిక పోలీసులు సెబ్ అధికారులు సమన్వయంతో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

24న తుది ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్ పక్కనే ఎస్పీ, ట్రైనీ కలెక్టర్

నెల్లూరు (వ్యవసాయం) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను పరిష్కరించి 24వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో రాజకీయ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 20,53,397 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. ఓటు నమోదు కోసం వచ్చిన ఫామ్-6, ఓట్ల బదిలీ కోసం వచ్చిన ఫామ్-8 దరఖాస్తులను పరిష్కరించి 24న తుది జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. ఇక 25వ తేది నామినేషన్లకు ఆఖరని 26న పరిశీలన ఉంటుందని తెలిపారు. 27, 28వ తేదీ సెలవు రోజులు కాబట్టి 29వతేదీ ఒక్కరోజు మాత్రమే ఉపసంహరణకు గడువు ఉంటుందని వెల్లడించారు. అదేరోజు మధ్యాహ్నం అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని తెలిపారు. నామినేషన్లు ప్రారంభమైనప్పటి నుంచి ఖర్చులన్నీ లెక్కల్లోకి వస్తాయని సెక్షన్ 127-ఎ ప్రకారం పత్రికల్లో ఇస్తున్న ప్రకటనలకు తప్పనిసరిగా పబ్లిషర్ పేరును ముద్రించాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

● జూన్ 6వ తేదీ వరకు కోడ్

జూన్ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ హరినారాయణన్ స్పష్టం చేశారు. ఇక నామినేషన్ల స్వీకరణ తొలిరోజున నెల్లూరు పార్లమెంటు స్థానానికి ఒకటి, 8 నియోజకవర్గాలకు 9మంది అభ్యర్థులు 14 నామినేషన్లు వేయడం జరిగిందని తెలిపారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో గురువారం ఎస్పీ ఆరీఫ్ హఫీజ్‌తో కలిసి ఆయన విలేకరుతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.1.78 కోట్ల నగదు సీజ్ చేయడం జరిగిందని చెప్పారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఇప్పటికే జిల్లాకు వచ్చారని సాధారణ పరిశీలకులు, పోలీసు పరిశీలకులు ఈ నెల 24న జిల్లాకు వస్తారని వెల్లడించారు.

ఆత్మకూరు ఉదయగిరి

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 18: ఏపీ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులు సూచించిన వెబ్‌సైట్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జీ.మురళీకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మర్రిపాడులో అగ్నిమాపక వారోత్సవాలు

మర్రిపాడు, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని సిబ్బందికి గురువా రం అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగిన పుడు తీసుకోవాల్సిన జాగ్ర త్తలను వివరించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు.

నామినేషన్ల పర్వం ప్రారంభం

ఆత్మకూరు, ఏప్రిల్ 18: నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమయ్యింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.మధులత నోటిఫికేషన్ విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. ప్రతిరోజూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహన్నం 3గంటల్లోపు నామినేషన్‌ను స్వీకరిస్తా మన్నారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థులు ర్యాలీలు, ఇతర ఆర్భాటాలపై ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరి అన్నారు. నామినేషన్లు చేసే అభ్యర్థులు మూడు వాహనాల్లోనే రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీటన్నింటిని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100మీటర్ల దూరంలోనే నిలిపివేసి అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతిస్తామన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులకు సంబంధించి గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీకి ఒకరు, స్వతంత్రులు పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలన్నీ అనుసరిస్తేనే నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అపశ్రుతి జరగకుండా కేంద్రం వద్ద డీఎస్పీ సాయినాథ్, ఎస్‌ఐలు ఇంద్రసేనారెడ్డి, అనూష, తిరుపతయ్యల ఆధ్వర్యంలో సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థులు తమ ఆస్తుల వివరాలు, నేరచరిత్ర, అఫిడవిట్‌లో ఎలాంటి ఖాళీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. నామినేషన్ దరఖాస్తులో 15 పాస్ ఫోటోలు, ప్రతి అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చన్నారు. 26న నామినేషన్ల స్క్రూటిని, 29న ఉపసంహరణ, అభ్యర్థుల తుదిజాబితా ప్రకటిస్తామన్నారు.

ఉదయగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నోటీస్ బోర్డులో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ ఫారం-1 నోటీసులు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 25వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు, ఎస్‌ఐలు ఇంద్రసేనారెడ్డి, అనూష, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్వతంత్ర అభ్యర్థిగా కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన చెరుకూరు వేణుగోపాల్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌కు అందజేశారు.

ఆత్మకూరు: మొదటిరోజు ఒక నామినేషన్ దాఖలైంది. ఆత్మకూరు అసెంబ్లీ స్థానానికి యుగతులసి పార్టీ అభ్యర్థి నెల్లూరు కృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. .

కుదిరిన ముహూర్తం!

ఆత్మకూరు: నియోజకవర్గంలోని టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఈ నెల 22, 24న నామినేషన్లు దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చేవూరు శ్రీధర్‌రెడ్డి నామినేషన్ ముహూర్తాన్ని ఖరారు చేయలేదు.

● టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి నామినేషన్‌కు ముందు నెల్లూరు ఏసీ సెంటర్‌లోని వినాయకస్వామి ఆలయం, కాపువీధిలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆనం కుటుంబ పెద్ద ఏసీ సుబ్బారెడ్డి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆత్మకూరుకు బయలుదేరుతారు. అక్కడ అంకమ్మమాను వద్ద, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేసి నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తారు.

● వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి ఎన్నికల్లో నామినేషన్‌కు ముందు స్వగ్రాం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు.

● కాంగ్రెస్ అభ్యర్థి చేవూరు శ్రీధర్‌రెడ్డి ఈ ఎన్నికల్లో పోటీ చేయడం ఇది రెండోసారి. ఆయన నామినేషన్ ముహూర్తం ఖరారు కాలేదు.


ఉదయగిరి : నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తున్న వేణుగోపాల్


భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్‌ఐలు

విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం

● కాంగ్రెస్ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు


విలేకరులతో మాట్లాడుతున్న కొప్పుల రాజు తదితరులు

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 18 : విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యమిచ్చేలా కృషి చేస్తానని కాంగ్రెస్ నెల్లూ రు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు వెల్లడించారు. గురువారం నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న సమయంలో గ్రామీణ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా ఒక్కో గ్రామా నికి కోటి రూపాయలు మంజూరు చేయించానని పేర్కొన్నారు. నెల్లూరులో వీఆర్ విద్యాసంస్థ గతంలో ఓ వెలుగు వెలిగిందని, నేడు దాన్ని మూసి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా గెలిస్తే విద్యకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, జగన్‌లు కాంగ్రెస్ నుంచే వచ్చారని, ఎన్నో ఉద్యమాలకు, సంక్షేమ కార్యక్రమాలకు జిల్లా శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు తలారి బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ గ్రూపుల్లో సేల్స్‌మన్ ప్రచారం

● జగన్ వీడియోలు వైరల్ ● తెలిసినా పట్టించుకోని అధికారులు

కలిగిరి, ఏప్రిల్ 18: పట్టణంలోని కావలి రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం సేల్స్‌మన్ ఎస్‌కే ఆయుబ్ వైసీపీకి చెందిన సీఎం జగన్ వీడియోలను వాట్సప్ గ్రూపుల్లో వైరల్ చేస్తున్నాడు. వైసీపీఎస్‌ఎం కలిగిరి మండలం, ప్రజాశక్తి న్యూస్ కలిగిరి తదితర వాట్సప్ గ్రూపుల్లో వీటిని రెండు రోజుల క్రితం పోస్టుచేశాడు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ వైసీపీ వీడియోలు పోస్ట్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే ఆ దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్‌పై వేటు పడింది. అయినా సరే మరో ఉద్యోగి ఇలా చేస్తుండడంపై స్థానికులు అధికారుల తీరును దుయ్యబడుతున్నారు.


వాట్సప్ గ్రూపుల్లో సేల్స్‌మన్ పోస్టు చేసిన వీడియో

ఐదుగురు వలంటీర్ల రాజీనామా

కలువాయి: అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో జరుగుతున్న గ్రామ వలంటీర్ల రాజీనామాలు మం డలంలో 58కి చేరాయి. ఇదివరకే 53 మంది రాజీనామాలు చేయగా గురువారం మరో 5గురు రాజీనామా చేశారు.

ఉదయగిరిలో ట్రాఫిక్ మళ్లింపు

ఉదయగిరి: ఎన్నికల నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఈ నెల 25వరకు ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కేంద్రం నుంచి వంద మీటర్ల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. కార్లు, మోటార్‌బైక్‌లు సినిమా హాలు సెంటర్ మీదుగా, లారీలు, బస్సులు స్టేట్‌పేట్ సమీపంలోని హైవే రోడ్డు మీదకు మళ్లిస్తున్నట్లు చెప్పారు.

వైసీపీ నాయకుల ప్రచారం

సీతారామపురం: రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వీసీ అల్లూరు రాజు గురువారం సీతారామపురం పరమటివీధి, బ్రాహ్మణవీధిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పాలగిరి ముద్దుకృష్ణమరాజు, కసుమర్లపూడి పవన్, వైసీపీ నాయకులు ఉన్నారు.

ఉదయగిరి రూరల్: నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కోడలు నిహారిక రెడ్డి గురువారం బ్రాహ్మణవీధి, షామీర్షావీధి ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు, పార్టీ మండల కన్వీనర్ ఓబులరెడ్డి, అక్కి. భాస్కర్‌రెడ్డి, గొల్లపల్లి తిరుపతి ఉన్నారు.

సేవ చేసేందుకే వచ్చా : కాకర్ల

వరికుంటపాడు, ఏప్రిల్ 18: తాను రాజకీయ నాయకుడిగా రాలేదని, ప్రజలకు సేవ చేసేందుకే వచ్చానని ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. గురువారం విరువూరు, నార్త్‌కృష్ణం రాజుపల్లి, తొడుగుపల్లి, నార్త్‌కొండాయపాళెం, ధర్మవరం, పెద్దిరెడ్డిపల్లి, తోటల చెరువుపల్లి గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. తనతోపాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చామన్నారు. ఏళ్ల తరబడి ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతానన్నారు. గతంలో టీడీపీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, బొల్లినేని వెంకట రామారావుల హయాంలోనే ఉదయగిరి ప్రాంతం అభివృద్ధి చెందిం దన్నారు. తన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఏడాదికిపైగా ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నా కనీసం తాగునీటి సమస్య పరిష్కారానికి కూడా చర్యలు తీసుకోలేదంటే ఆయన పనితీరును ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో ప్రజలు అనేక సమస్యలతో అల్లాడిపోయారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్ని కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రత్యేక పథకాలను తీసుకొస్తున్నట్లు తెలిపారు. తాగు, సాగునీరు, వైద్య, విద్య, ఉద్యోగ వసతులు లేక వేల కుటుంబాలు వలస వెళ్లి జీవనం సాగిస్తుండడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన వెంటనే గ్రామాలతో పాటు కాలనీలపై ప్రత్యేక దృష్టిసారించి తప్పనిసరిగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు. అలాగే ఉదయగిరిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు కాలనీల్లో వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసి సురక్షిత తాగునీరు అందేలా చూస్తామన్నారు. పెద్దిరెడ్డిపల్లి, వెలుగొండ రిజర్వాయర్లతోపాటు సోమశిల హైలెవల్ కెనాల్ పనులు ఏళ్ల తరబడి ముందుకు సాగకుండా నిలిచిపోయాయని ఎద్దేవా చేశారు. రూ.12లక్షల కోట్లు అప్పు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకొని ముందుకు సాగడం జరుగుతుందన్నారు.

టీడీపీలో చేరిక: విరువూరు, ధర్మవరం, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబీకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని కాకర్ల పార్టీ కండువాలతో ఆహ్వానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, నాయకులు ముజ్జే లక్ష్మీనారాయణ, నాదిండ్ల రాజేంద్ర, పోలుబోయిన శ్రీకాంత్, జాజం హజరత్, గంగవరపు పుల్లయ్య, కొమ్మలపాటి జనార్దన్, తెల్లగొర్ల వెంకటయ్య పాల్గొన్నారు.


అశ్వంపై కత్తి దూస్తున్న కాకర్ల


వరికుంటపాడు: కాకర్లను సన్మానిస్తున్న అభిమానులు

రైలులో మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో రైల్వే పోలీసులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 18: శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించి, అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వివరాలను రైల్వే డీఎస్పీ సీహెచ్ విజయభాస్కర్ గురు వారం రాత్రి తన కార్యాలయంలో వివరించారు. బుధవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గణేష్, ప్రసాద్‌లు బెంగళూరు నుంచి కాకినాడ వెళుతున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. రైలు నెల్లూరు సమీపిస్తుండగా ఎస్4 కోచ్‌లో 63వ బెర్త్ కింద ఓ ఐరన్‌బాక్స్ అనుమానాస్పదంగా కనిపించింది. దాన్ని స్వాధీనం చేసుకొని ఎవరిదని ప్రశ్నించారు.అక్కడున్న ప్రయాణికులు తమదికాదని చెప్పడంతో బాక్స్ తెరిచి చూశారు. అందులో కర్ణాటకకు చెందిన 69 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రైల్వే ఎస్‌ఐ మాలకొండయ్య కేసు నమోదు చేశారు. విలేకరుల సమావేశంలో రైల్వే ఎస్‌ఐలు ఎస్ హరిచందన, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలైలో వృద్ధులకు రూ.7వేల పింఛన్

ఏఎస్ పేట, ఏప్రిల్ 18: తెలుగుదేశం అధికారంలోకి వస్తే వృద్ధులకు రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచి పింఛన్ అందిస్తామని, పెంచిన పింఛన్‌ను ఏప్రిల్, మే, జూన్ నెల రూ.3వేలను కలిపి జూలై నెలలో రూ.7వేలు అందజేయనున్నట్లు త్మకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన కొండమీద కొండూరు, కుప్పూరుపాడు, పొనుగోడు, చౌటభీమవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు, రోడ్ల సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప పదేళ్లలో అభివృద్ధి జరగలేదన్నారు. తనకు అవకాశం ఇస్తే గ్రామలను అభివృద్ధి చేసి చూసిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వలంటీర్లకు రూ.10వేలు జీతం, వృద్ధులకు రూ.4వేలు పింఛన్, ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పొందాలంటే ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ దేవరాల హజరత్తయ్య, నాయకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, నరసింహారెడ్డి, మాల్యాద్రినా యుడు, నంది వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

సంగం: ఆత్మకూరు నియోజకవర్గంలో మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి గతంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు మళ్లీ ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తామని ప్రజలు చెబుతున్నారని ఆనం రంగమయూర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఆత్మకూరు ఉమ్మడి అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తరపున కొరిమెర్లలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏ గ్రామానికి వెళ్లిన ఆనం రామనారాయణ రెడ్డి గతంలో చేసి చేసిన అభివృద్ధిని ప్రజలే గుర్తు చేస్తుంటే సంతోషంగా ఉందన్నారు. మండల పార్టీ కన్వీనర్ శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులు రెడ్డి, అనిల్‌రెడ్డి, ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు అభివృద్ధి ప్రదాత, కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పట్టణ ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గురువారం టీడీపీ నేతలు మున్సిపాల్టీ పరిధిలోని టిడ్కో భవనాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. టీడీపీ అధికారంలోకి వస్తే టిడ్కో భవనాల్లో మెరుగైన వసతులు చేకూరుతాయని వారు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్ గందళ్ల వేణు, టీడీపీ నేతలు చల్లా రవికుమార్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు ఉన్నారు.

అనంతసాగరం: టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గెలుపుతో ఆత్మకూరు అభివృద్ధి చెందుతుందని పార్టీ మండలాధ్యక్షుడు మునగపాటి సునీత తెలిపారు. గురువారం మాజీ ఎంపీపీ సుబ్బారాజుతో కలసి ఆయన అనంతసాగరం, మంచాలపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వారి వెంట ఎంపీటీసీ బుజ్జమ్మ, నాయకులు ఎం జనార్దన్‌రెడ్డి, శివారెడ్డి, నర్సారెడ్డి, తిరుపతినాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి ఉన్నారు.


కుప్పూరుపాడులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి


ఆత్మకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

ర్యాలీలో చిక్కుకున్న అంబులెన్స్

● ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల వైఫల్యం


వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో చిక్కుకున్న అంబులెన్స్

కావలి, ఏప్రిల్18: వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి గురువారం నామి నేషన్ సందర్భంగా భారీ ర్యాలీ ఉంటుందని ముందుగా చెప్పినా, ట్రాఫిక్‌ను నియంత్రించటంలో పోలీసులు వైఫల్యం చెందారు. దీంతో పట్టణంలో సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించగా, మండు టెండలో ప్రజలు తీవ్ర అసౌ కర్యాలకు గురయ్యారు. ఆ ట్రాఫిక్‌లో ఓ పేషంట్‌ను తీసుకుని వెళుతున్న అంబులెన్స్ కూడా ఇరుక్కుపోయింది. దాన్ని ముందుకు పంపటానికి పోలీసులు నానా అవస్థలు పడ్డారు. వారు ముందు జాగ్రత్తలు తీసుకోకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీకే సాధ్యం


ఉదయగిరి : మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చేయడం టీడీపీకే సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి అన్నారు. గురువారం సంజీరాజుపల్లి, చెరువుపల్లి గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఇంటింటా మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓబులరెడ్డి, కప్పా శ్రీనివాసులు, సురేంద్ర, రవీంద్ర, కిరణ్ పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వెంగన్నపాళెం, తిమ్మాపురం, తెడ్డుపాడు గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, ఎంపీటీసీలు మాదాల రామాచంద్ర, తాళ్లూరి దయానందం, సర్పంచ్‌లు వెంకటరత్నం, నాగయ్య, మల్లంపాటి గురవయ్యనాయుడు, దుగ్గిరెడ్డి గురవారెడ్డి పాల్గొన్నారు.

చేజర్ల: భావితరాల భవిష్యత్ కోసం తెలుగుదేశంకు ఓటు వేయాలని గురువారం చిత్తలూరులో గ్రామ యవకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ఒక్కడేనే అది సాధ్యం అన్నారు. ఈ ఎన్నికల్లో ఆత్మకూరు నియోజకవర్గ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేయాని ఓటర్లకు విన్నవించారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ నల్లబోతు శివ, బీఎల్‌ఏ బొద్దు శ్రీనివాసులు, రఫీ, వెంగబాబు, శివ, బద్రి, అజయ్, సూర్య పాల్గొన్నారు.

ఉద్యోగులపై తప్పుడు కేసులు దుర్మార్గం

సీతారామపురం, ఏప్రిల్ 18: రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా తటస్థంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై అధికార పార్టీ నాయకులు వారిపై తప్పుడు కేసులు బనాయించేలా చేయడం దుర్మార్గం అని నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రామారావు అన్నారు. గురువారం ఆయన ఈ విషయంపై స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. రిగ్గింగ్ జరుగకుండా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

ఆత్మకూరు, ఏప్రిల్ 18: ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఇండియా కూటమి అభ్యర్థి (కాంగ్రెస్)గా పోటీ చేయనున్న చేవూరు శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పోలు రాజు గెలుపే లక్ష్యంగా సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు కదలాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి కె డేవిడ్ రాజు అధ్యక్షతన నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు.

లక్ష్మీసాయిప్రియకు ఓటు వేసి గెలిపించండి


చింతలాత్మకూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కలువాయి, ఏప్రిల్ 18: వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు గురువారం చింతలాత్మకూరులో ప్రచారం నిర్వహించారు. ఎంపీగా వరప్రసాద్‌ను కూడా గెలిపించాని కోరారు. ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, సర్పంచ్ ప్రభావతి, సోమంపల్లి కృష్ణయ్య, ఎస్.వేణుగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన నవమి ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 18: గండిపాళెంలో మూడురోజులుగా జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు స్వామివార్ల వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలను భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉదయగిరి: స్థానిక బీసీ కాలనీ సమీపంలోని గణేష్ దత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా కాగడ హారతి, అభిషేకాలు, కోలాటం, పల్లకీ సేవ, జెండా ఉత్సవం చేపట్టారు. అనంతరం అన్నదాన భక్తులకు అన్నదానం చేపట్టారు. స్థానికులే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శ్రీరామచంద్రమూర్తికి శేషవాహనసేవ

సంగం, ఏప్రిల్ 18: వంగల్లు కోదండరామాలయంలో బుధవారం అర్ధరాత్రి శేష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని శేష వాహనంపై ఉంచి గజమాలలు అలంకరించారు. అలంకరించిన గ్రామోత్సవంలో స్వామివారిని ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి కిషోర్ కుమార్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

25న గురుకుల ప్రవేశ పరీక్ష

నెల్లూరు (వీఆర్సీ), ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ - 2024 పరీక్ష ఈనెల 25న జరుగుతుందని గురుకులాల కన్వీనర్ జీ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. హాల్‌టికెట్లు వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

26న బాలికలకు కౌన్సెలింగ్

జిల్లాలోని ముత్తుకూరు, కందలేరు, బుచ్చిరెడ్డిపాళెం, కొత్తకోడూరు, సంగం, ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో 5వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ టీ హేమలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసి మెరిట్ జాబితాలోని విద్యార్థినులకు ఆ రోజు ముత్తుకూరులోని గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థినులు ర్యాంకు కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఒక గంట ముందుగా హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 8247358603, 9494090137 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

23న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 18 : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమా వేశం ఈనెల 23న నెల్లూరు టౌన్‌హాల్లో జరుగుతుందని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న జరగాల్సిన ఈ సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల 23న జరుపుతున్నామని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	144
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6984
వెండి కిలో ధర	రూ. 86,000
వెండి ఒక గ్రాము	రూ. 88.00

ఓగూరు ఎస్సీ కాలనీలో టీడీపీలోకి వలసలు


టీడీపీలో చేరిన ఓగూరు ఎస్సీ కాలనీ వైసీపీ కార్యకర్తలు

కందుకూరు, ఏప్రిల్ 18: మండలంలోని ఓగూరు ఎస్సీ కాలనీలో పలు కుటుంబాల వారు వైసీపీని వీడి గురువారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఒంగోలు డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. పల్లె రఘుబాబు, రవిబాబు, మేడికొండ మనోజ్‌కుమార్, మెడబలిమి మధుబాబు, మాధవరావు, బల్లికూర తిరుపతిస్వామి, గొర్రెముచ్చు శ్రీను, బూసి రవితేజ, ఏపూరి సింగయ్య, కార్తీక్ సహా పలు కుటుంబాల వారు టీడీపీలో చేరగా వారికి నాగేశ్వరరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎస్సీకాలనీ టీడీపీ నాయకులు ఏపూరి మాలకొండయ్య, కొండలరావు, బల్లికూర వెంకటేశ్వర్లు, ఏపూరి మాలకొండయ్య, అంద్రా మాల్యాద్రి, గ్రామపార్టీ నాయకులు అల్లం వెంకటేశ్వర్లు, గుళ్లా శ్రీనివాసులు, రాయపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

17, 18 వార్డులలో ఇంటింటి ప్రచారం

టీడీపీ కూటమి అభ్యర్థులైన ఇంటూరి నాగేశ్వరరావు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను గెలిపించాలని కోరుతూ నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య ఆధ్వర్యంలో పట్టణంలోని 17, 18 వార్డులలో గురువారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బంగారమ్మ గుడి ప్రాంతంలో స్థానిక పార్టీ నాయకులు, మహిళలతో కలిసి ఇంటింటికి తిరిగి రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. తెలుగుదేశం పార్టీ మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, దివి శ్రీనివాసులు, నగర జయకృష్ణ, ముచ్చు శ్రీను, జొన్నాదుల రాఘవయ్య, షేక్ ఫిరోజ్, కాకుమాని మాల్యాద్రి, అమర రామలింగయ్య, అత్తంటి మాధవరావు, దివి వెంకటేశ్వర్లు, జంపాల శ్రీకాంత్, బెల్లం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కావలి కందుకూరు

నిత్యావసరాలు ఏవి జగనన్నా..!?

- బియ్యం పంపిణీకే పరిమితం
- అప్పుడప్పుడు చక్కెర, కందిపప్పు, గోధుమపిండి
- మిగిలిన సరుకులపై అమలుకాని హామీ



కొండాపురం, ఏప్రిల్ 18: రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు చౌకధరల దుకాణాల ద్వారా ఇంటికి అవసరమయ్యే అన్నిరకాల నిత్యావసర సరుకులు రాయితీపై అందిస్తామని చెప్పిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదు. ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం మాత్రమే రెగ్యులర్‌గా పంపిణీ జరుగుతోంది. చక్కెర, కందిపప్పు, గోధుమపిండి అప్పుడప్పుడు పంపిణీ చేస్తున్నారు. ఇతర వస్తువులు ఏవీ పంపిణీకి నోచుకోవడం లేదు. దీంతో గత ఎన్నికల సమయంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మారాయి. మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 34 చౌకధరల దుకాణాలు ఉండగా 12,533 బియ్యం కార్డులున్నాయి. లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి సరుకుల పంపిణీకి మండలానికి 8 వాహనాలను కేటాయించారు. ఇందులో గొట్టిగుండాల, గొట్టిగుండాలపాలెం, ఉప్పలూరు పంచాయతీలకు చెందిన వాహనం మరమ్మతులకు గురవ్వడంతో నిలిచిపోయింది. ఆయా గ్రామాల లబ్ధిదారులు దుకాణం వద్దకే వెళ్లి బియ్యం తీసుకొంటున్నారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి, మంత్రులు చౌకధరల దుకాణాల ద్వారా ఇంట్లో వినియోగించే నిత్యావసర సరుకులన్నీ రాయితీపై అందిస్తామని చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. మంత్రుల ప్రకటనలు వింటున్న లబ్ధిదారులు ఆ సరుకులన్నీ ఎందుకు తేవట్లేదని పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లపై ఎదురుదాడికి దిగుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తే మేము తీసుకువచ్చి ప్రజలకు చేరవేస్తామని ఆపరేటర్లు అంటున్నారు. ఇటీవల వరకు బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు, గోధమపిండి తదితర వస్తువులు మాత్రమే రాయితీపై ఇస్తుండగా రెండు, మూడు నెలలుగా అవికూడా ఇవ్వలేదు. ఈ నెలలో మాత్రం బియ్యంతో పాటు చక్కెర పంపిణీ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బియ్యంతోపాటు చక్కెర, గోధుమపిండి, కందిపప్పు తదితర నిత్యావసరాలు రాయితీపై సరఫరాచేసి పేదలను అందుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను వివరణకోరగా ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఈనెల ఒక్క బియ్యం, చక్కెర మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు.

గ్యాస్ గోదాముల వద్ద భద్రతా నియమాలు పాటించాలి


గ్యాస్ గోదాము సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి రూరల్, ఏప్రిల్ 18: పట్టణంలోని ప్రతి గ్యాస్ గోదాము వద్ద భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించాలని అగ్నిమాపక అధికారి రామసిద్ధార్థ పేర్కొన్నారు. పట్టణంలోని జేమ్స్ హెచ్‌పీ గ్యాస్ గోదాము, ప్రశాంతి ఫిల్లింగ్ స్టేషన్ సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామసిద్ధార్థ మాట్లాడుతూ గ్యాస్ గోదాముల వద్ద, పెట్రోల్ బంకుల వద్ద ఎలాంటి అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ, పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

కలిగిరి, ఏప్రిల్ 18: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం త్రైతశకం-46 క్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్‌ను ఎంపీడీవో రంగసుబ్బరాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జీ.ప్రసాద్ మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా రూపొందించారన్నారు. భగవద్గీత శ్లోకముల సారాంశములతోపాటు నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలు ఇందులో పొందుపరచారన్నారు. అనంతరం క్యాలెండర్లను పోలీసు, రెవెన్యూ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు జి సుధాకర్, వై మహేంద్ర, డి మధు, ఎన్ వెంకటేశ్వర్లు, డి రమణమ్మ, రమణయ్య, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి రథోత్సవం


అల్లూరులో రథంపై ఊరేగుతున్న సీతా లక్ష్మణ హనుమత్సమేత కోదండరాముడు

అల్లూరు, ఏప్రిల్ 18 : అల్లూరుపేటలో వెలసిన సీతా లక్ష్మణ హనుమత్సమేత కోదండరాముడి రథోత్సవం వైభవంగా జరిగింది. రామమందిరంలో జరుగుతన్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో సీతారాములను దర్శించుకునేందు ప్రముఖులు తరలివచ్చారు. జై.. శ్రీరామ్.. నినాదాలతో రథాన్ని స్థానిక యువత సునాయాసంగా లాగారు. ఆతనంతరం అడుగడుగునా భక్తులు రథానికి నీరాజనాలు పలికారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

చంద్రబాబుతోనే మాదిగల జీవితాల్లో వెలుగులు

- ఆదిఆంధ్ర కాలనీల్లో పర్యటించిన ఎంఆర్‌పీఎస్ నేతలు


మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

లింగసముద్రం, ఏప్రిల్ 18 : షెడ్యూల్ కులాల వర్గీకరణ సమస్య పరిష్కారం కావాలన్నా, మాదిగల జీవితాల్లో వెలుగులు నింపాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ, ఎంఎస్సీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాసు మాదిగ చెప్పారు. గురువారం వారు మండలంలోని వీఆర్ కోట, చీమలపెంట, జంపాలవారిపాలెం, మొగిలిచెర్ల, గంగపాలెం, ఆర్‌ఆర్ పాలెం గ్రామాల్లోని ఆది ఆంధ్ర కాలనీల్లో పర్యటించి తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చదలవాడ కిట్టు మాదిగ, అవినాష్, అజయ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అదనపు డీఎంహెచ్‌వో తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

చిట్టగుంట, ఏప్రిల్ 18: బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్ వలి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. 104 మొబైల్ వాహన నిర్వహణ, వైద్యశాల, ల్యాబ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. లెప్రసీ, హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై వైద్యాధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు జీ.హారిక, నిత్యప్రశాంతి, ప్రవీన్‌కుమార్, రాజశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో పేదలు నలిగిపోయారు..!


నార్తుమోపూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

అల్లూరు, ఏప్రిల్ 18 : ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో పేదలు నలిగిపోయారని టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరు నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్తుమోపూరులో గురువారం ఆయన ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదో చేసేస్తారని నమ్మి వైసీపీకి ఓట్లు వేసిన పేదలు నేడు కట్టుబట్టలతో నిలబడ్డారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో గిరిజన, చల్లా యానాదుల జీవనం క్షీణ దశకు చేరుకుందన్నారు. జీవన వ్యయం తీవ్రంగా పెరిగిపోవడంతో పేదలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన చెందారు. అన్ని రాష్ట్రాలకంటే ముందంజలో ఉండేలా రాజధాని నిర్మిస్తానని నమ్మించి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్ అసలు రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విడవలూరు దశరథరామిరెడ్డి, మేడా మల్లారెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు ప్రయోజనం

- తీరప్రాంత గ్రామాల్లో కావ్య ప్రచారం


ప్రజలకు అభివాదం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 18: టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు ప్రయోజనం చేకూరిందని ఎన్డీఏ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి చెప్పారు. కావలిరూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీలోని పలు గ్రామాలలో గురువారం ఆయన స్థానిక నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, బీజేపీ నేత జీ.భరత్ కుమార్, జనసేన నేత తిరుపతిస్వామి పాల్గొన్నారు.

కావలిని అవినీతికి అడ్డాగా మార్చారు

కావలిటౌన్ : ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి కావలిని అవినీతి, అసాంఘికాలకు అడ్డాగా మార్చారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ఆరోపించారు. ముసునూరులోని తన నివాసం వద్ద కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనతో ప్రజలు విసిగి చెందారని చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు.

నేడు నామినేషన్ : ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం ఉదయం 12-20 గంటలకు తాను నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సూచనలతో ఉదయం 9-30 నిమిషాలకు ముసునూరులోని తన నివాసంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు కిషోర్, బాబురావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య, అలేఖ్య, మన్నవ రవిచంద్ర, బీజేపీ నేతలు భరత్, బ్రహ్మానందం, జనసేన నేతలు పబ్బాసాయి, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు మూడు నామినేషన్ల దాఖలు

కావలి, ఏప్రిల్ 18: కావలి అసెంబ్లీ నియోజకవర్గానికి తొలిరోజు గురువారం ముగ్గురు నేతలు 5 సెట్ల నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో కావలి రిటర్నింగ్ అధికారి శీనానాయక్‌కు అందజేశారు. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వైసీపీ పేరుతో 2 సెట్లు, రామిరెడ్డి ఆదిలక్ష్మి వైసీపీ పేరుతో 2 సెట్లు నామినేషన్లను దాఖలు చేశారు. గుంజి శ్రీనివాసులు బహుజన సమాజ్ పార్టీ పేరుతో ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు.

కావలిటౌన్ : వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గురువారం ఉదయం స్థానిక కలుగోళ శాంభవి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాయానికి వెళ్లి నామినేషను వేశారు. ఆయన వెంట ఎంపీ బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి

కందుకూరు, ఏప్రిల్ 18: కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షేక్ గౌస్ మొహిద్దీన్ విజయం కోసం సీపీఎం, సీపీఐ కార్యకర్తలు, నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో అభ్యర్థి గౌస్ మొహిద్దీన్‌తో కలిసి సీపీఐ నాయకులు పి.మాలకొండయ్య, బూసి సురేష్‌బాబు, సీపీఎం నాయకులు ఎస్‌ఏ గౌస్, జి.వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్ తదితరులు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సీహెచ్ నరేష్, ఆనంద్‌మోహన్, బాలబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేద్దాం


ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కలిగిరి, ఏప్రిల్ 18: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ వింజమూరు తాలూకా సమావేశం స్థానిక పీహెచ్‌సీలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరు జిల్లా హంస యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా కప్పా నారాయణరాజు (హెల్త్ అసిస్టెంట్, కలిగిరి), వింజమూరు తాలూకా ప్రెసిడెంట్‌గా ఎస్ చెంచురామయ్య (సీహెచ్‌ఓ, కొండాపురం, పీహెచ్‌సీ) సెక్రటరీగా సక్కుబాయమ్మ(పీహెచ్ఎన్, కలిగిరి), ట్రెజరర్‌గా డీ దొరసానమ్మ(స్టాఫ్ నర్స్, కలిగిరి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్ సాయిలక్ష్మి(సీహెచ్‌ఓ, కలిగిరి), పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్ తిరుపతి రావు(ల్యాబ్ అసిస్టెంట్, కలిగిరి)తోపాటు 20మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ వైద్య సిబ్బంది సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఏపీ హంస మెడికల్ యూనియన్‌కి ప్రభుత్వ గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డికి, హంస రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, నెల్లూరు జిల్లా హంస జనరల్ సెక్రటరీ చేజర్ల సుధాకర్, జనరల్ సెక్రటరీ బీ కమల్‌కిరణ్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే జలీల్, తదితరులు పాల్గొన్నారు.

27న పాలిసెట్ పరీక్ష

కావలి రూరల్, ఏప్రిల్ 18: ఈ నెల 27వ తేదీన పాలిసెట్-2024 పరీక్షలు నిర్వహించనున్నట్లు రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సుశీల్ కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల, కావలి పట్టణం ఉదయగిరిరోడ్డులోని విశ్వోదయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్లు ఇంటర్నెట్ సెంటర్‌లో, లేదా రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో తీసుకోవచ్చని తెలిపారు. పరీక్షల ప్రిపరేషన్‌కు విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత కోచింగ్ ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కోచింగ్‌కు హాజరయ్యే 91 మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9642255592, 9949022772, 9440707944ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కిలో పొగాకు రూ.246

కలిగిరి, ఏప్రిల్ 18: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 771 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 640 బేళ్లు కొనుగోలు చేశారు. నో బిడ్-100, ఆర్‌ఆర్-6, సీఆర్-13, జంపింగ్‌లాట్స్-12 కారణాలతో 131 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.246, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.226.90గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

దుండిగంలో టీడీపీ నేతల ప్రచారం

దగదర్తి(చిట్టగుంట), ఏప్రిల్ 18: దగదర్తి మండలం దుండిగం పంచాయతీ, ఎన్టీఆర్ నగర్‌లలో గురువారం ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలన నుంచి విముక్తి కావాలంటే టీడీపీని గెలిపించాలన్నారు. ఉమ్మడి పార్టీలు బలపరుస్తున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉన్నారు. కాగా కిడ్నీ సమస్యతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వెలిపోడు గ్రామానికి చెందిన షేక్.షాహీరను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు శ్రీహరి, ఖాజారహమతుల్లా, ఫైరోజ్ తదితరులు ఉన్నారు.

సీపీఎం నేత మృతికి సంతాపం

చిట్టగుంట, ఏప్రిల్ 18: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటకు చెందిన సీపీఎం ఏత దానం(68) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య సందర్శించి పూలమాలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఆయన వెంట తాళ్లూరు మాల్యాద్రి, గడ్డం వెంకయ్య, శేషాద్రి, కాటయ్య ఉన్నారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు!

అల్లూరు, ఏప్రిల్ 18: విద్యుత్ సరఫరాను నియంత్రించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా మారాయి. మండల కేంద్రమైన అల్లూరులో అక్కడక్కడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు తగ్గిపోయి ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయి. అల్లూరు వాటర్ ప్లాంట్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తగ్గిపోయి ఉండడంతో అక్కడ నిత్యం పశు సంచారం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా వేణుగోపాల స్వామి దేవాలయం వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. అదేవిధంగా ఆర్‌డిఆర్ కాలనీలో పాఠశాలకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ఉండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు ప్రమాదానికి గురవుతారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీటిని మరమ్మతులు చేపట్టి ప్రమాదం లేకుండా చూడాలని తల్లిదండ్రులు, రైతులు కోరుతున్నారు.


వేణుగోపాలస్వామి ఆలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉలవపాడు యువకుడికి రుయాలో అరుదైన శస్త్ర చికిత్స


కోలుకున్న యువకుడితో రుయా అధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 18: తిరుపతిలోని రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాక అరుదైన శస్త్ర చికిత్స చేసి ఓ యువకుడి ప్రాణాలు కాపాడామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. గురువారం ఆ వివరాలను తెలిపారు. నెల్లూరు జిల్లా ఉలవపాడుకు చెందిన ఆనంద్‌బాబు(26) చిన్నతనం నుంచి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. ఏ ఆస్పత్రిలో చూపించినా నయం కాకపోవడంతో కుటుంబీకులు అతడిని రుయాస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడి ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు డాక్టర్ సుబ్బారావు పరీక్షించగా, ఊపిరితిత్తులో చీముతో కూడిన గడ్డలు (డెకాటికేషన్ ఆఫ్ లంగ్) ఉన్నట్లు గుర్తించారు. ఇది అరుదుగా వచ్చే వ్యాధి అని తేల్చారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి కళ్యాణి రమ, అనస్థీషియా విభాగాధిపతి రాధా ఆధ్వర్యంలో ఈనెల ఎనిమిదో తేదీన మినీ థొరకాటమీ (చిన్నపాటి రంధ్రం) పద్ధతిలో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ పద్ధతిలో శస్త్ర చికిత్స చేయడం వల్ల రోగి రోజుల వ్యవధిలోనే కోలుకుంటాడని సూపరింటెండెంట్ తెలిపారు. ప్రస్తుతం యువకుడు కోలుకోవడంతో ఆయన్ను డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు. అరుదైన సర్జరీని విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు, ఏఆర్ఎంవో హరికృష్ణ, క్లినిక్ పర్యూజనిస్టు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు తిలోదకాలు!

- వాటర్ ట్యాంకుల్లో చేపట్టని క్లోరినేషన్
- అధికారుల పర్యవేక్షణ కరువు
- దుర్వినియోగమవుతున్న నిధులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు


అంకభూపాలపురంలో క్లోరినేషన్‌కు నోచని వాటర్ ట్యాంక్

వలేటివారిపాలెం, ఏప్రిల్ 18 : ప్రజలకు రక్షిత నీటిని అందించే లక్ష్యంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాల ఓవర్ హెడ్ ట్యాంకుల పరిశుభ్రతను గాలికొదిలేశారు. దీంతో ఆరోగ్య కరమైన తాగునీటికి బదులు కలుషిత నీరు సరఫరా అవుతోంది. నీరు నిల్వ చేసే ట్యాకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తుండడంతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. వీటిని పర్యవేక్షించే నాథుడే లేడు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని 36 గ్రామాల్లో 38 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీరు పరిశుభ్రంగా ఉందానేది ప్రశ్నార్థకంగా మారింది. పథకం ప్రారంభించే సమయాల్లో ఆర్భాటాలు చేస్తున్న ప్రభుత్వం తర్వాత పూర్తిస్థాయిలో పథకం అమలు తీరును విస్మరిస్తోంది. కొన్ని చోట్ల నెలలు తరబడి ట్యాంకులను శుభ్రం చేయని పరిస్థితులు ఉంటున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్నిచోట్ల మొక్కుబడిగానే క్లోరినేషన్ జరుగుతుందన్న విమర్శలున్నాయి.

నిబంధనల ప్రకారం...

రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను ప్రతినెలా 15 నుంచి 30 రోజుల్లో శుభ్రం చేయాలి. పంచాయతీ కార్యదర్శి లాక్‌బుక్ ట్యాంక్ శుభ్రం చేసిన తేది, మళ్లీ శుభ్రం చేయాల్సిన తేదీని విధిగా నమోదు చేయాలి. ట్యాంక్ ఆ నెలలో శుభ్రం చేయించినట్లు అంగన్‌వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి సంతకాలు చేయాలి. కానీ గ్రామాల్లో ట్యాంకులు శుభ్రం చేయకుండానే శుభ్రం చేయిస్తున్నట్లు వీరితో సంతకాలు చేయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయితే శుభ్రం చేస్తున్న దాఖలాలు మాత్రం లేవు. ఈ క్రమంలో శుభ్రత కోసం వినియోగించాల్సిన నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నా యి.

● క్లోరినేషన్ ఊసే లేదు

గ్రామాల్లో ట్యాంకులను పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రతి 20 రోజులకొకసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి ఓపెన్ లెవల్ మోతాదుకు మించకుండా బ్లీచింగ్ వేయాలి. ఇది ఎక్కడా అమలు కావడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించి పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కలువాయి : దాచూరులో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఓటరు అనే నేను...

ప్రతిఒక్కరూ ఓటుహక్కును తప్పక వినియోగించుకోవాలని అధికారులు ఓటర్లను చైతన్యవంతులు చేస్తున్నారు. అందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఓటుహక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని ప్రతిజ్ఞ చేయించారు. శుక్ర, శనివారాల్లో కూడా ఎస్సీ కాలనీల్లో ఓటర్లను చైతన్యవంతులు చేసే కార్యక్రమం చేపడతామని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు.

- కలువాయి

అభ్యర్థి ఖర్చుకు చందాలేసి ఇచ్చేటోళ్లం!

మా రోజుల్లో



మా కాలంలో ఎలచ్చన్లకు.. ఇప్పుడు ఎలచ్చొన్లకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందయ్యా. అప్పట్లో ఇప్పటిలాగా మైకాల మోతల్లేవ్.. కరపత్రాల పంపిణీ లేదు.. గిర్రుగిర్రున తిరిగే కార్లూ లేవు. ప్రజలకు డబ్బులు ఇచ్చే చేసే ఆనవాయితీ లేదు. సేవాగుణం, పేరు ప్రఖ్యాతలు, కుటుంబ నేపథ్యం ఉన్న వ్యక్తులే పోటీలో నిలబడేవారు. ప్రజలు కూడా గ్రామపెద్ద సూచించిన వ్యక్తికే గుత్తగా ఓట్లు వేసి మాట మీద నిలబడేవారు. అభ్యర్థుల ఖర్చు కూడా రూ.వేలల్లో ఉండేది. కొన్ని గ్రామాల్లో ప్రజలే చందాలు వేసుకొని పోటీలో నిలబడ్డ వ్యక్తికి డబ్బులు ఇచ్చేటోళ్లు. కానీ ఇప్పుడంతాలేదు. ఎన్నికలంటేనే డబ్బుమయంగా మారి పోయింది. ఆర్థిక నేరస్థులు, రౌడీలు, హత్య కేసుల్లో నిందితులు సైతం ఎలచ్చన్లో నిలబడతా ఉండారు. ఇవన్నీ ప్రజలు గమనించాలి. భావితరాలను గుర్తు చేసుకుని అభివృద్ధి చేసేటోళ్లనే గెలుపువించుకోవాలి.

- గూడూరు శివరామయ్య (90), గండిపాళెం, ఉదయగిరి మండలం

విజ్ఞతతో ఆలోచించి ఓటేద్దాం

యువగళం



ఎన్నికల షెడ్యూలు విడదలైన నాటి నుంచి తొలి ఓటు వేస్తున్నాననే ఆలోచన సంతోషం కలిగిస్తోంది. నేను బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. చదువుకున్న యువత విజ్ఞతతో ఆలోచించి రాష్ట్రాభివృద్ధికి పాటు పడే వారికి ఓటు వేస్తే భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుంది. గడిచిన ఐదేళ్లలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. చదువుకోసమే కాదు.. ఉపాధి కోసమూ బయట రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఆశలు పెట్టేవారిని దూరంగా పెట్టి అవకాశాలు కల్పించే నాయకుడ్ని ఎన్నుకోవడానికి రానున్న ఎన్నికలో తొలి ఓటు వినియోగిస్తాం.

- శ్రీహర్షవర్ధన్ రెడ్డి, కలిగిరి

కఠినంగా ఎన్నికల ఆంక్షలు

- నెల్లూరు నగర రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్



సార్వత్రిక ఎన్నికలలో తొలిఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ మొదలైనందున కార్పొరేషన్ కార్యాలయం పరిసరాల్లో ఎన్నికల ఆంక్షలు కఠినంగా అమలు చేస్తున్నట్లు నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ వెల్లడించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలు తన కార్యాలయంతోపాటు నెల్లూరు ఆర్డీవో, సిటీ తహసీల్దారు కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉందని అన్నారు. కార్యాలయానికి 100 మీటర్లలోపు ర్యాలీ, ఊరేగింపులను ఆపేయాలని సూచించారు. 144 సెక్షను అమల్లో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగనివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సిటీ నియోజకవర్గంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని, ఇరగాళమ్మ సంఘం, చిల్డ్రన్స్‌పార్కు, పాతచెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

- నెల్లూరు (సిటీ)



విజయం కోసం...

ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య గురువారం సుదర్శన నారసింహ యాగం నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 11మంది రుత్వికులు శాస్త్రోక్తంగా సుదర్శనయాగం క్రతువు నిర్వహించారు.

- కందుకూరు



లైనింగ్ చేయకుండా వదిలేసిన కనిగిరి ప్రధాన కాలువ

ఆ మాటలు తలుచుకొని

'ఆత్మ' ఘోషిస్తోంది!

- ఆత్మకూరు నియోజకవర్గానికి రూ.85 కోట్లు అన్నారు... పైసా విదల్చలేదు!

సంగం, ఏప్రిల్ 18 : అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని సీఎం జగన్ హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా వాటి ఊసేలేదు. ఆ హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో జగనన్న మాట ఇచ్చి మడమ తిప్పారని ప్రజలు విమర్శిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2022 సెప్టెంబరు 6న సంగం బ్యారేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆత్మకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సుమారు రూ. 85 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంతో గొప్పగా ప్రకటించారు. దీంతో పలు సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలంతా సంబరపడ్డారు. కానీ సీఎం హామీ ఇచ్చి ఏడాదిన్నర పూర్తైంది. కానీ పైసా కూడా విడుదలయిన దాఖలాలు లేవు.



సంగం : అధ్వానంగా ఉన్న వంగల్లు - మర్రిపాడు రహదారిపై ఎర్రమట్టి తోలి గుంతలు పూడ్చిన ఆటో డ్రైవర్లు



మోసం గురూ!

సీఎం ఇంకా ఏం చెప్పారంటే...

- సంగం - నెల్లూరు జాతీయ రహదారి నుంచి సంగం బ్యారేజీ వరకు రహదారి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ఆ ఊసేలేదు.
- సంగం గ్రామ ప్రజలకు పెన్నానది నుంచి తాగునీటి పథకం కోసం సుమారు రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అది కొండెక్కింది.
- ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోల ని 12 ఇరిగేషన్ పనులకు సుమారు రూ. 40 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఒక్క ఇరిగేషన్ పనికి కూడా ప్రారంభం కాలేదు.
- ఆత్మకూరు మున్సిపాలిటీకి స్పెషల్ గ్రాంట్ కింద రూ. 12 కోట్లు ఇస్తామన్నారు. అదీ లేదు.
- నియోజకవర్గ పరిధిలోని 25 గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారుల నిర్మాణానికి రూ. 14 కోట్లు ఇస్తామని ప్రకటించారు. కానీ వాటి అతీగతీలేదు.

కలగానే పట్టణాభివృద్ధి

ఆత్మకూరు : జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చాక సీఎంగా ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి రూ. 12 కోట్లు మంజూరు చేస్తామని చెప్పినా, నిధులు విడుదలకాక పట్టణ సుందరీకరణ అలాగే మిగిలి ఉంది. అలాగే పట్టణ సమీపంలో ఉన్న చెరువు వద్ద 1.5 కి.మీ మేర ఆహ్లాదకరంగా ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ. 4కోట్లు మంజూరుకు రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గతంలో కోటిరూపాయలతో బట్టేపాడు రోడ్డు సమీపంలో అర్ధంతరంగా ఆగిపోయిన పార్కు నిర్మాణం పనులు పునరుద్ధరణలో భాగంగా రూ. 2 కోట్లతో 3 ఎకరాల్లో పార్కు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. వీటిలో దేనికీ కూడా నిధులు మంజూరు కాలేదు. కాగా ఆత్మకూరు సమీపంలోని అశ్వనీపురం, జంగాలపల్లి మీదుగా రింగ్ రోడ్డు నిర్మాణానికి అధికారులు సర్వే చేశారు. నిధులు రాక పనులు ప్రారంభం కాలేదు.

● యాత్రలో ఇచ్చిన హామీలూ అంతే..

జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంకల్ప యాత్రలో భాగంగా 2018 ఫిబ్రవరి 6న సంగం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటికే 75 శాతం పూర్తయిన సంగం బ్యారేజీని ఏడాదిలోపు పూర్తి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. సీఎం అయిన మూడున్నర ఏళ్లకు బ్యారేజీ పూర్తి చేయకుండానే ప్రారంభించారు. నేటికీ 2శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా రూ. 20 కోట్ల బిల్లులు కాంట్రాక్టరుకు బకాయిలు ఉన్నాయి. బ్యారేజీ వద్ద కనీసం ఘాట్‌లు కూడా నిర్మించలేదు. దీంతో సంగమేశ్వరుడి తెప్పోత్సవం కూడా నిర్వహించడం లేదు.

● మాజీ ఎంపీ హామీలకూ దిక్కులేదు..

సంగం బ్యారేజీని పర్యాటక కేంద్రంగా చేస్తామని నెల్లూరు ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. హామీ ఇవ్వడం మడమతిప్పడం జగనన్న బాటలో మేకపాటి కుటుంబం ప్రయణిస్తున్నట్లు నియోజకవర్గ ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఏడు దశాబ్దాలు.. మూడు కుటుంబాల ఆధిపత్యం !

- తొలిసారిగా బరిలో కొత్తముఖాలు
- మారనున్న కందుకూరు రాజకీయ ముఖచిత్రం
- మంత్రులు, స్పీకర్‌గా ఇక్కడివారు ప్రాతినిధ్యం

కందుకూరు, ఏప్రిల్ 18: కందుకూరు నియోజకవర్గంలో ఏడు దశాబ్దాల రాజకీయ చరిత్ర మారి కొత్తశకానికి తెరలేచింది. ఈ సెగ్మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రధాన రాజకీయ పార్టీలు కొత్తముఖాలను ఈ ఎన్నికల్లో బరిలో దింపాయి. పార్టీలు ఏవైనా ఈ 70 ఏళ్లకాలంలో మూడు కుటుంబాల మధ్యే రాజకీయం నడిచింది. దివి కుటుంబం వర్సెస్ నలమోతు కుటుంబంగా రెండు దశాబ్దాలపాటు రాజకీయాలు నడిచాయి. అనంతరం దివి కుటుంబం వర్సెస్ మానుగుంట కుటుంబంగా రూపాంతరం చెంది, 50 ఏళ్ల పాటు పెత్తనం సాగింది. ఇరవై ఏళ్లు తమ ప్రాబల్యం చాటుకున్న దివి కుటుంబం, 50 ఏళ్లగా నియోజకవర్గంపై తమ పట్టు కొనసాగించిన మానుగుంట కుటుంబం తాజా ఎన్నికలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఎన్నో సార్లు ఆయా పార్టీలు ప్రయోగాలు చేసినా ఆ మూడు కుటుంబాలవారే ఎవరో ఒకరు రంగంలో ఉంటూ వచ్చారు. కొత్తవారు రంగంలోకి వచ్చినా ఆ మూడు కుటుంబాలు ఒక్కటై మట్టికరిపించిన చరిత్ర కందుకూరుది.

● కాంగ్రెస్‌కు కంచుకోట

కాగా 2024 ఎన్నికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వైసీపీ అభ్యర్థిగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పోటీచేస్తుండగా, టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు బరిలో దిగారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో పార్టీలకన్నా వ్యక్తులకు, వర్గాలకు ప్రజలు అధిక ప్రాధాన్యం ఇచ్చి గెలిపించారు. ప్రధాన రాజకీయ పార్టీల గాలి బలంగా వీస్తున్న తరుణంలోనూ రాష్ట్రమంతటిది ఓదారి అయితే, కందుకూరుది మరోదారి అన్నట్లుగా ఇక్కడ ఇండింపెండెంట్లను రెండు దఫాలు గెలిపించారు.

● 15 సార్లు ఎన్నికలు

1952లో కందుకూరు నియోజకవర్గం ఆవిర్భవించగా ఇప్పటివరకు 15సార్లు ఎన్నికలు జరిగాయి. రెండేసి సార్లు టీడీపీ, వైసీపీ, స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. 9 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే జయకేతనం ఎగుర వేశారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నల మోతు చెంచు రామానాయుడు విజయం సాధించారు.



1955 ఎన్నికల్లో కాం గ్రెస్ అభ్యర్థిగా దివి కొండయ్య చౌదరి గెలుపొందారు. 1962,67 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నలమోతు చెంచు రామానాయుడు విజయం సాధించారు. 1972లో మానుగుంట ఆదినారాయణరెడ్డి స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిచారు. 1978లో దివి కొండయ్య చౌదరి కాంగ్రెస్ అభ్యర్థిగా, 1983లో స్వతంత్ర అభ్యర్థిగా మానుగుంట ఆదినారాయణరెడ్డి విజేతలుగా నిలిచారు. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదినారాయణ రెడ్డి గెలిచారు. 1989 ఎన్నికల్లో ఆదినారాయణరెడ్డి వారసునిగా రాజకీయ ప్రవేశం చేసిన మాను గుంట మహీధరరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా విజ యం సాధించారు. 1994 ఎన్నికల నాటికి దివి కొండయ్య చౌదరి వారసునిగా డాక్టరు దివి శివరాం రంగంలోకి వచ్చి విజయం సాధించారు. 1999 ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా దివి శివరాం విజయం సాధించారు. 2004, 2009 ఎన్ని కల్లోనూ కాం గ్రెస్ అభ్యర్థి మహీధరరెడ్డి గెలిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన నలమో తు చెంచురామానాయుడు సమీప బంధువు పోతుల రామారావు విజేతగా నిలిచారు. 2019 వైసీపీ అభ్యర్థిగా మానుగుంట మహీధరరెడ్డి విజయం సాధించారు. ఈ దఫా ఆ మూడు కుటుంబాలకు చెందిన వ్యక్తులు బరిలో లేకుండా ఇద్దరూ కొత్తవారే బరిలో దిగుతున్నారు.

ముఖ చిత్రం

ముగ్గురు మంత్రులు, స్పీకర్ ప్రాతినిధ్యం

కందుకూరు నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన ఆ మూడు కుటుంబాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి పదవులు వరించటం విశేషం. నలమోతు కుటుంబం, దివి కుటుంబంలోని తొలితరం నేతలే మంత్రులుగా ప్రాతినిధ్యం వహించారు. మానుగుంట కుటుంబాన్ని రెండోతరంలో మంత్రిపదవి వరించింది. దివి కొండయ్యచౌదరి మంత్రిగా ప్రాతినిధ్యం వహించటమేకాగా అసెంబ్లీ స్పీకర్‌గానూ పనిచేశారు. కందుకూరు నెల్లూరు జిల్లాలో అంతర్భాగంగా ఉన్న రోజుల్లోనే జిల్లా నుంచి నలమోతు చెంచు రామానాయుడు 1965 నుంచి 1972 వరకు రాష్ట్ర అటవీశాఖామంత్రిగా పనిచేశారు. జిల్లా విభజన జరిగి ప్రకాశం జిల్లా ఆవిర్భవించాక దివి కొండయ్య చౌదరి 1978-83 మధ్యకాలంలో ఆర్‌అండ్‌బీశాఖ మంత్రిగా, రెండేళ్ల శాసనసభాపతిగానూ పనిచేశారు. ఇక మానుగుంట కుటుంబం నుంచి ఆదినారాయణ రెడ్డి వారసుడైన మహీధరరెడ్డి 2010-14 కాలంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రిగా పనిచేశారు. దివి కొండయ్య చౌదరి కుమారుడు దివి శివరాం రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేయటమేకాగా 2017 నుంచి 2019 వరకు రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

కందుకూరు నుంచి గెలుపొందిన అభ్యర్థులు

సంవత్సరం	విజేత	ప్రత్యర్థి	మొత్తం ఓట్లు	మెజారిటీ
1952	నలమోతు చెంచురామానాయుడు (కాంగ్రెస్)	దివి కొండయ్య చౌదరి(కేఎంపీపీ)	59286	4361
1955	దివి కొండయ్య చౌదరి (కాంగ్రెస్)	రావిపాటి వెంకయ్య (సీపీఐ)	60357	7097
1962	నలమోతు చెంచురామానాయుడు(కాంగ్రెస్)	దివి కొండయ్య చౌదరి(స్వతంత్ర పార్టీ)	67880	1672
1967	నలమోతు చెంచురామానాయుడు(కాంగ్రెస్)	డాక్టర్ వీవై కోటారెడ్డి (స్వతంత్ర పార్టీ)	82561	5912
1972	మానుగుంట ఆదినారాయణరెడ్డి(స్వతంత్ర)	ఎస్. చెంచురామానాయుడు (కాంగ్రెస్)	94258	5433
1978	దివి కొండయ్య చౌదరి(కాంగ్రెస్)	ఎం.ఆదినారాయణరెడ్డి (జనతాపార్టీ)	105692	12305
1983	మానుగుంట ఆదినారాయణరెడ్డి (స్వతంత్ర)	గుత్తా వెంకటసుబ్బయ్య(టీడీపీ)	116376	2841
1985	మానుగుంట ఆదినారాయణరెడ్డి (కాంగ్రెస్)	గుత్తా వెంకటసుబ్బయ్య (టీడీపీ)	128782	1285
1989	మానుగుంట మహీధరరెడ్డి(కాంగ్రెస్)	మోరుబోయిన మాలకొండయ్య(టీడీపీ)	155210	10198
1994	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	మానుగుంట మహీధరరెడ్డి (ఐఎన్‌సీ)	148677	6025
1999	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	మానుగుంట మహీధరరెడ్డి (ఐఎన్‌సీ)	176773	1525
2004	మానుగుంట మహీధరరెడ్డి (కాంగ్రెస్)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	153392	7879
2009	మానుగుంట మహీధరరెడ్డి (కాంగ్రెస్)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	185120	4243
2014	పోతుల రామారావు (వైసీపీ)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	194679	3806
2019	మానుగుంట మహీధరరెడ్డి(వైసీపీ)	పోతుల రామారావు (టీడీపీ)	218961	14936

భలే భలే బంతి!

- ప్రచారాలకు బస్తాల కొద్దీ కొనుగోళ్లు
- డిమాండ్ పెరగడంతో రెట్టింపయిన ధర

ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుండటంతో అభ్యర్థులు నిర్వహించే రోడ్‌షోలు, బహిరంగ సభలు, ర్యాలీలకు ప్రత్యేక ఆకర్షణగా బంతి పూలను చల్లుతుంటారు. వీటిలో మాలలుగా తయారు చేసి తమ అభిమాన నాయకులు వేస్తుంటారు. గత కొన్ని రోజులుగా అన్ని నియోజకవర్గాలలో అభ్యర్థుల ప్రచారాలు హోరెత్తిస్తుండటంతో నెల్లూరులోని మార్కెట్లో బంతిపులు కనబడటం లేదు. బెంగళూరు, హొసకోట (కర్ణాటక) ప్రాంతాల నుంచి నెల్లూరుకు నిత్యం బస్సుల్లో ముప్పాతిక శాతం బంతిపూలు దిగుమతి అవుతుంటాయి. పాతిక శాతం పూలు నెల్లూరురూరల్, సంగం, ఇందుకూరుపేట, పొదలకూరు తదితర మండలాల నుంచి అందుతుంది. ఇలా మార్కెట్‌కు వచ్చిన బంతిపూలన రాజకీయ పార్టీల నాయకులు బస్తాల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు. పండగలు, పెళ్లిళ్ల సీజన్లలో ఈ పులు గరిష్ఠంగా కేజీ రూ. 100 ధర ఉంటుంది. కానీ ప్రస్తుతం బంతికి డిమాండ్ ఉండటంతో కేజీ రూ.200ల వరకు ధర పలుకుతోంది. ఇంత ధర ఇస్తామన్నా నెల్లూరు మార్కెట్లో బంతిపూలు చూద్దామన్నలేకపోవడం గమనార్హం

- నెల్లూరు (సిటీ)



సర్వేపల్లిలో నామినేషన్లు నిల్!

వెంకటాచలం, ఏప్రిల్ 18: 2024 సార్వత్రిక నాలుగో విడత ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. వెంకటాచలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటుచేయగా గురువారం సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) చిన్న ఓబులేసు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు, ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు అవకాశం ఉందన్నారు.

మల్లూరు సర్పంచు దువ్వూరు బీజేపీలో చేరిక

ముత్తుకూరు, ఏప్రిల్ 18: పారిశ్రామికవేత్త, మల్లూరు సర్పంచ్ దువ్వూరు విజయ్ కుమార్‌రెడ్డి గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో వైసీపీని వీడి బీజేపీలో చేరారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన తన సోదరుడు హరి ప్రసాద్‌రెడ్డితో కలిసి రాజమండ్రిలోని క్యాంపు కార్యాలయంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డిని పురందేశ్వరీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి బీజేపీ ఇన్‌చార్జ్ రవీం దర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, వేళ్లపాలెం సునీల్‌రెడ్డి, ఇసనాక పద్మనాభరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేరుకు చెరువు... తాగునీరు కరువు..!

పోలినాయుడుచెరువులో గిరిజనుల అవస్థలు



ఊట బావి వద్ద నీటి కోసం వేచిఉన్న గ్రామస్థులు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 18 : తాగేందుకు గుక్కెడు నీళ్ళు లేక అల్లాడుతున్నా పట్టించుకునే నాథుడే లేరంటూ మండలంలోని ఇస్కపాళెం పంచాయతీలోని పోలినాయుడు చెరువు గిరిజనులు వాపోతున్నారు. కాలనీలో సమస్యలతో 300కు పైగా గిరిజన కుటుంబాలు, 200 పైగా ముస్లిం కుటుంబాల వారు అవస్థలు పడుతున్నారు. తాగునీటి సమస్య ఒకవైపు, వీధిదీపాలు వెలగక చిమ్మచీకట్లో విషసర్పాల సంచారంతో భయాందోళనతో కాలం గడుపుతున్నారు. ఇంటింటికీ కుళాయి పథకం ఆ గ్రామానికి ఆమడ దూరం. ఆగ్రామం మొత్తానికి కలిపి మూడు కుళాయిలకే నీళ్లు వస్తాయని, అదీ కూడా అరగంటో.. గంటో వదులుతారని, అదీ మేము కూలి పనులకు వెళ్లినప్పుడు మిట్టమధ్యాహ్నమో, అర్ధరాత్రి వదిలితే నీళ్లు ఎలా పట్టుకోవాలని వాపోతున్నారు. ఒకే ఒక్క పంపు వుంటే అందులో నుంచి వచ్చే నీళ్లు కూడా చిలింవాసన వస్తుంటాయని, ఎక్కడో పొలాల్లోకెళ్ళి రైతులు దయతలిస్తే వారి పుణ్యమా అంటూ ఒకటో, రెండో బిందెలు నీళ్ళతో కాలంగడుపుకుంటున్నామని వాపోతున్నారు. మా బాధలు నాయకులకు, అధికారులకు ఎన్నిసార్లు ఏకరువు పెట్టినా పట్టించుకునేవారే లేరని ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి ఒక ట్యాంకు వుంటే అది కూడా పగుళ్ళిచ్చి కొద్ది పాటి నీరు నింపితే కారిపోతాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



కుళాయిల వద్ద తాగునీటి కోసం వరుసలో పెట్టిన ఖాళీ బిందెలు

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 18: జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో గురువారం కామాక్షి తాయికి అర్చకులు లక్షకుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఈ పూజలో 20 మందికి పైగా అర్చకులు పాల్గొన్నారు.

హంస వాహనంపై కోదండరాముడి విహారం



హంసవాహనంపై విహరిస్తున్న కోదండరాముడు

స్థానిక పెద్దూరులోని సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు యాళివాహన సేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సంగమేశ్వరుడికి ఏకాంతసేవ



శివపార్వతులకు ఏకాంతసేవ

మనుబోలు, ఏప్రిల్ 18: శ్రీకామాక్షితాయి సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శివపార్వతులకు ఏకాంతసేవ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ఉభయదాతలుగా గూడూరు పెంచలయ్య, జ్యోతి దంపతులు వ్యవహరించారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ఎన్నికల్లో పోటీ : కొండా



సమావేశంలో మాట్లాడుతున్న కొండా వెంకయ్య

విడవలూరు, ఏప్రిల్ 18: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని విడవలూరుకు చెందిన కొండా వెంకయ్య తెలిపారు. స్థానిక సాయిబాబా మందిరంలో గురువారం ఆయన కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత అంకమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో నామినేషన్ దాఖలు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్ బాషా, రాము, నిరంజన్, కళ్యాన్, బ్రహ్మయ్య, ఏడుకొండలు, పాల్గొన్నారు.

పేదల పేరుతో కాకాణి దోపిడీ : సోమిరెడ్డి



వెంకటాచలం: టీడీపీలో చేరిన వారితో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, ఏప్రిల్ 18: కరోనా సమయంలో పేదలకు సాయం పేరుతో రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తల వద్ద మంత్రి కాకాణి కోట్ల రుపాయలు దండుకొని నెల్లూరులో విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించుకున్నాడని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం నెల్లూరులోని వేదాయపాళెంలోని ఆయన కార్యాలయంలో వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, వలిపి మునుస్వామి, యమల రాజేంద్ర, ఉప్పు రాఘవేంద్ర, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఉపసర్పంచు, వార్డు మెంబర్ టీడీపీలో చేరిక

మండలంలోని ఎగువమిట్ట, పూడిపర్తి గ్రామాల్లో గురువారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా టీడీపీ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి ముక్కు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎగువమిట్ట గ్రామ వైసీపీ ఉపసర్పంచ్ నెల్లూరు కృష్ణయ్య, 7వ వార్డు మెంబర్ కోమారి శ్రీనివాసులు, వైసీపీ నాయకులు నాశిన మస్తానయ్య, సజ్జనపు కిరణ్‌లతో సహా పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

భారీ మెజార్టీతో సోమిరెడ్డిని గెలిపించాలి

మండలంలోని చవటపాళెం పంచాయతీ అనుపల్లిపాడు గ్రామంలో గురువారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమార్తె సింధురెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సోమిరెడ్డి చేసిన అభివృద్ధి పనులు, చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో తన తండ్రి సోమిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మెదరమెట్ల కోదండయ్యనాయుడు, కందిమళ్ల శ్రీనివాసులు నాయుడు, మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, కుడితిపూడి మురళీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో సోమిరెడ్డి విజయం తథ్యం

పొదలకూరు: సర్వేపల్లిలో అత్యధిక మెజారిటీతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుస్తారని కోడలు శృతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలిరెడ్డి హనుమారెడ్డి, సుబ్బిరామిరెడ్డి, పల్లారపు కృష్ణయాదవ్, కండే మస్తానయ్య, సుజిత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకుంటాం : ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 18: కోవూరు నియోజకవర్గంలో రైతాంగాన్ని ఆదుకుంటామని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని డేవిస్‌పేట గ్రామంలో గురువారం ప్రశాంతిరెడ్డి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డేవిస్‌పేటలో ఉన్న ఉద్యాన రైతులను ఆదుకుంటామని, ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ.20వేలు అందిస్తామని తెలిపారు. గ్రామాలలో తాగు, సాగునీరు సమస్య పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, గుడి హరికుమార్‌రెడ్డి, మునగాల రంగారావు, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, తన్నీరు మధు పాల్గొన్నారు.

కాబోయే కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మే



ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు నియోజకవర్గానికి కాబోయే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మేనని టీడీపీ నాయకుడు నాగిరెడ్డి ద్వారకానాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక నాయకుడు తులసి సురేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి పాతమినగల్లులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వేమిరెడ్డి దంపతులను గెలిపించుకోవాలని కోరారు.

చంద్రబాబు సభకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పొదలకూరు, ఏప్రిల్ 18: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పొదలకూరు పర్యటన సందర్భంగా గురువారం టీడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సభకు స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని గేట్ సెంటర్ కూడలి వద్ద సభ నిర్వహించేందుకు, అలాగే హెలిప్యాడ్ కోసం మండలంలోని మర్రిపల్లి, మనుబోలు రోడ్డులోని ఒక పొలం, సంగంరోడ్డు దగ్గర ఒక స్థలాన్ని (కండలేరు ఎడమకాలువ పక్కన) పరిశీలించారు.

హెలిప్యాడ్ పరిశీలించిన డీఎస్పీ



మర్రిపల్లి వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ డీఎస్పీ, సీఐలు

మాజీ సీఎం చంద్రబాబునాయుడు శనివారం రానున్న నేపథ్యంలో మండలంలోని రామ్‌నగర్ మర్రిపల్లి సమీపంలో హెలిప్యాడ్ స్థలాన్ని నెల్లూరు డీఎస్పీ పి వీరాంజనేయరెడ్డి పరిశీలించారు. పొదలకూరు ఎస్ఐ రామకృష్ణ, సీఐ రాంబాబుతో కలిసి హెలీప్యాడ్, పొదలకూరులో బహిరంగ సభ స్థలం అన్నివిధాలా అనుకూలమా.. కాదా అని విశ్లేషించారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 18: ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి సాయిలహరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మండల్ పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చేస్తున్న పనులు యథావిధిగా చేసుకోవచ్చని, పబ్లిక్ ప్రదేశాలలో ఎటువంటి బ్యానర్లు ఏర్పాటు చేయరాదని, ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసుకున్న పార్టీ ఫ్లెక్సీలు ఈసీ పరిధిలోకి రాదని ఆమె తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ నోడల్ అధికారి యు శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఫారమ్-12డి దరఖాస్తుల అందజేత



దరఖాస్తు స్వీకరిస్తున్న సెక్టోరియల్ అధికారులు

మనుబోలు, ఏప్రిల్ 18: మండలంలోని దివ్యాంగులు, వృద్ధులకు గురువారం సెక్టోరియల్ అధికారులు వేమారెడ్డి, జహీర్‌బాషా ఫారమ్-12డి దరఖాస్తులను అందజేశారు. పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకుంటారా, పోలింగ్ కేంద్రానికి రాగలరా అనే నిర్ణయాన్ని దరఖాస్తు రూపంలో తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనుబోలు బిఎల్‌వోలు పాల్గొన్నారు.

దాడిలో ఒకరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 18: మండలంలోని రేబాల నెహ్రూనగర్ కాలనీ వద్ద మసీదులో ప్రార్థనలు చేసుకుని ఇంటికి వెళ్తున్న సాదిక్ అనే వ్యక్తిపై గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. దాడిలో గాయాలపాలైన సాదిక్‌ను చికిత్స నిమిత్తం బుచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కోవూరులో తొలిరోజే ప్రధాన అభ్యర్థుల నామినేషన్లు

● టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి నామినేషన్ దాఖలు



ప్రశాంతిరెడ్డికి వీర తిలకం దిద్దుతున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

కోవూరు, ఏప్రిల్ 18: కోవూరు అసెంబ్లీ స్థానానికి గురువారం ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా తహసీల్దారు కార్యాలయంలోని ఎన్నికల కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్‌కు అందజేశారు. ఎన్డీఏ బలపరిచిన టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన భర్త నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు సిటీ, రూరల్ అభ్యర్థులు నారాయణ, శ్రీధరరెడ్డి, టీడీపీ నాయకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, అజీజ్, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి వచ్చి నామినేషన్ వేశారు. ముందుగా మందబయలు కూడలిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో వేమిరెడ్డి దంపతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి తన సతీమణి ప్రశాంతిరెడ్డి నుదుటన వీర తిలకం దిద్దారు.



నామినేషన్ దాఖలు చేసి వస్తున్న వేమిరెడ్డి దంపతులతో టీడీపీ నేతలు నారాయణ, అజీజ్, కోటంరెడ్డి

● స్పందన అమోఘం : వేమిరెడ్డి

రాష్ట్రంలో టీడీపీకి స్పందన అమోఘంగా లభిస్తోందని నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. వీరాంజనేయస్వామి ఆలయం వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోనేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తనకు పూర్తి మద్దతు పలుకుతున్నారని చెప్పారు.

విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం

● కాంగ్రెస్ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు



విలేకరులతో మాట్లాడుతున్న కొప్పుల రాజు తదితరులు

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 18 : విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యమిచ్చేలా కృషి చేస్తానని కాంగ్రెస్ నెల్లూరు ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు వెల్లడించారు. గురువారం నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న సమయంలో గ్రామీణ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా ఒక్కో గ్రామానికి కోటి రూపాయలు మంజూరు చేయించానని పేర్కొన్నారు. నెల్లూరులో వీఆర్ విద్యాసంస్థ గతంలో ఓ వెలుగు వెలిగిందని, నేడు దాన్ని మూసి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎంపీగా గెలిస్తే విద్యకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, జగన్‌లు కాంగ్రెస్ నుంచే వచ్చారని, ఎన్నో ఉద్యమాలకు, సంక్షేమ కార్యక్రమాలకు జిల్లా శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు తలారి బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ గ్రూపుల్లో సేల్స్‌మన్ ప్రచారం

● జగన్ వీడియోలు వైరల్ ● తెలిసినా పట్టించుకోని అధికారులు

కలిగిరి, ఏప్రిల్ 18: పట్టణంలోని కావలి రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం సేల్స్‌మన్ ఎస్కే ఆయుబ్ వైసీపీకి చెందిన సీఎం జగన్ వీడియోలను వాట్సప్ గ్రూపుల్లో వైరల్ చేస్తున్నాడు. వైసీపీఎస్ఎం కలిగిరి మండలం, ప్రజాశక్తి న్యూస్ కలిగిరి తదితర వాట్సప్ గ్రూపుల్లో వీటిని రెండు రోజుల క్రితం పోస్టుచేశాడు. ప్రభుత్వ నుంచి జీతం తీసుకుంటూ వైసీపీ వీడియోలు పోస్ట్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే ఆ దుకాణంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్‌పై వేటు పడింది. అయినా సరే మరో ఉద్యోగి ఇలా చేస్తుండడంపై స్థానికులు అధికారుల తీరును దుయ్యబడుతున్నారు.



వాట్సప్ గ్రూపుల్లో సేల్స్‌మన్ పోస్టు చేసిన వీడియో

రైలులో మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో రైల్వే పోలీసులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 18: శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించి, అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వివరాలను రైల్వే డీఎస్పీ సీహెచ్ విజయభాస్కర్ గురు వారం రాత్రి తన కార్యాలయంలో వివరించారు. బుధవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గణేష్, ప్రసాద్‌లు బెంగళూరు నుంచి కాకినాడ వెళుతున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. రైలు నెల్లూరు సమీపిస్తుండగా ఎస్4 కోచ్‌లో 63వ బెర్త్ కింద ఓ ఐరన్‌బాక్స్ అనుమానాస్పదంగా కనిపించింది. దాన్ని స్వాధీనం చేసుకొని ఎవరిదని ప్రశ్నించారు.అక్కడున్న ప్రయాణికులు తమదికాదని చెప్పడంతో బాక్స్ తెరిచి చూశారు. అందులో కర్ణాటకకు చెందిన 69 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రైల్వే ఎస్ఐ మాలకొండయ్య కేసు నమోదు చేశారు. విలేకరుల సమావేశంలో రైల్వే ఎస్ఐలు ఎన్ హరిచందన, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో చిక్కుకున్న అంబులెన్స్

● ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల వైఫల్యం



వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో చిక్కుకున్న అంబులెన్స్

కావలి, ఏప్రిల్18: వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి గురువారం నామి నేషన్ సందర్భంగా భారీ ర్యాలీ ఉంటుందని ముందుగా చెప్పినా, ట్రాఫిక్‌ను నియంత్రించటంలో పోలీసులు వైఫల్యం చెందారు. దీంతో పట్టణంలో సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించగా, మండు టెండలో ప్రజలు తీవ్ర అసౌ కర్యాలకు గురయ్యారు. ఆ ట్రాఫిక్‌లో ఓ పేషంట్‌ను తీసుకుని వెళుతున్న అంబులెన్స్ కూడా ఇరుక్కుపోయింది. దాన్ని ముందుకు పంపటానికి పోలీసులు నానా అవస్థలు పడ్డారు. వారు ముందు జాగ్రత్తలు తీసుకోకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

25న గురుకుల ప్రవేశ పరీక్ష

నెల్లూరు (వీఆర్సీ), ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ - 2024 పరీక్ష ఈనెల 25న జరుగుతుందని గురుకులాల కన్వీనర్ జీ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. హాల్‌టికెట్లు వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

26న బాలికలకు కౌన్సెలింగ్

జిల్లాలోని ముత్తుకూరు, కండలేరు, బుచ్చిరెడ్డిపాళెం, కొత్తకోడూరు, సంగం, ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో 5వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ టీ హేమలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసి మెరిట్ జాబితాలోని విద్యార్థినులకు ఆ రోజు ముత్తుకూరులోని గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థినులు ర్యాంకు కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో ఒక గంట ముందుగా హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 8247358603, 9494090137 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

23న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 18 : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమా వేశం ఈనెల 23న నెల్లూరు టౌన్‌హాల్లో జరుగుతుందని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న జరగాల్సిన ఈ సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల 23న జరుపుతున్నామని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	144
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6984
వెండి కిలో ధర	రూ. 86,000
వెండి ఒక గ్రాము	రూ. 88.00

ఎన్నికల పర్వం

తొలి రోజు ఒక్కొక్కటే !

● నెల్లూరు పార్లమెంటు, రూరల్ అసెంబ్లీకి ఒక్కో నామినేషన్ దాఖలు

● నగర నియోజకవర్గానికి నిల్



నామినేషన్ పత్రాలు కలెక్టర్‌కు అందిస్తున్న మాబు

నెల్లూరు(సిటీ/క్రైం/వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తొలిరోజు నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. సిటీ నియోజక వర్గానికి ఒక్కటి కూడా దాఖలు కాలేదు.

● కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో, కలెక్టర్ హరినారాయణన్‌కు ఆర్‌పీఐ పార్టీ తరపున ఎంపీ అభ్యర్థిగా ఎస్కే మాబు నామినేషన్ పత్రాలు అందజేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్థాపించిన ఆర్‌పీఐ పార్టీని ఓటర్లు గెలిపించాలని కోరారు.

● నెల్లూరు రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అయిన నెల్లూరు ఆర్డీవో మాలోల గురువారం ఉదయం 10.30 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. టీడీపీ తరపున కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని బలపరుస్తూ మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ తొలి నామినేషన్ దాఖలు చేశారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా కేవలం ఇద్దరు నాయకులతో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు.

● నెల్లూరు సిటీ నియోజకవర్గానికి తొలిరోజు ఒక్క నామినేషను కూడా దాఖలు కాలేదు. రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయంలోనే ఉన్నారు. సిటీ నియోజకవర్గానికి సంబంధించిన వ్యయ పరిశీలకుడిగా ఎన్నికల సంఘం నియమించిన కంచన్‌రామ్ మీనా కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్వోను మర్యాద పూర్వకంగా కలిశారు.

నామినేషన్ కేంద్రాల వద్ద ఆంక్షలు

● చుట్టూ బారికేడ్లతో బందోబస్తు ● పోలీసుల అత్యుత్సాహం ● సామాన్యులకు అసౌకర్యం

నెల్లూరు(క్రైం/వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 18 : ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించే కేంద్రాల వద్ద యంత్రాంగం ఆంక్షలు విధించింది. పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ కేంద్రమైన కలెక్టరేట్ చుట్టూ వంద మీటర్ల దూరం వరకు బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లే ప్రతి ఒక్కరిని పరిశీలించి ఐడీ కార్డులు ఉన్న వారినే లోపలికి పంపించారు. నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు ఐదుగురిని మాత్రమే అనుమతించారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి బందోబస్తును పరిశీలించారు. ఇక, నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయం వద్ద కూడా పెద్ద ఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. కేవలం ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయ సిబ్బందిని మాత్రమే లోపలికి పంపారు. సామాన్య ప్రజలు పనుల నిమిత్తం లోనికి వెళ్లాలంటే పోలీసులు వారి వివరాలు నమోదు చేసుకుని అనుమతించారు. మొత్తంగా తొలి రోజు నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

అయితే కలెక్టరేట్ చుట్టు పక్కల ప్రాంతాల్లో నిత్యం జనరద్దీ ఉంటుంది. అటువంటి చోట ఆంక్షలు విధించడంతో సామాన్యులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. కలెక్టరేట్ చుట్టూ ప్రజలు రాకపోకలు సాగించకుండా, నడిచేందుకు కూడా అవకాశం లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అంతేకాక, వీఆర్సీ కూడలి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో పాత జెడ్పీ కార్యాలయం వద్ద కూడా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలీసులు అత్యుత్సాహం చూపి ద్విచక్ర వాహనాలను కూడా అనుమతించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ ప్రాంతంలో బ్యాంకులు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, కలెక్టరేట్ ప్రాంగణంలో వివిధ శాఖల కార్యాలయాలు ఉండటంతో వాటికి వెళ్లే వారికి అవస్థలు తప్పలేదు. నామినేషన్ ప్రక్రియ వారం రోజులు కొనసాగుతుండటంతో అన్ని రోజులు ఈ బాధలు పడక తప్పదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



పాత జెడ్పీ కార్యాలయం వద్ద నుంచే వాహనదారులను వెనక్కు పంపుతున్న పోలీసులు



ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు పొడవునా ఏర్పాటు చేసిన బారికేడ్లు

100 నియోజకవర్గాల్లో పోటీ : ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 : ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి తరఫున రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నామని ఆ సమితి అధ్యక్షుడు పెళ్లకూరు సురేంద్రరెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి మేనిఫెస్టోను విడుదల చేశారు. తిరుపతి ఎంపీ అభ్యర్థిగా రమేష్‌బాబు, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ మారం సుధాకర్‌కు బీఫారాలు అందజేశారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సయ్యద్‌బాషా, రూరల్‌కు నరసయ్య, సర్వేపల్లికి షాజహాన్‌ను ప్రకటించి బీఫారాలు అందజేశారు.

నారాయణకు లోక్‌సత్తా మద్దతు



నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 18 : మాజీ మంత్రి, నెల్లూరు టీడీపీ అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణకు లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొప్పోలు రామారావు, కార్యదర్శి శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. వారు గురువారం నగరంలోని నారాయణ నివాసానికి వెళ్లి కలిశారు. రామారావు మాట్లాడుతూ తమ పార్టీ అధిష్ఠానం ఎన్‌డీఏ కూటమికి మద్దతు తెలిపిందన్నారు. ఈ క్రమంలో నారాయణతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని చెప్పారు.

నెల్లూరు సిటీ

నెల్లూరు రూరల్

నెక్లెస్ రోడ్డు.. డంపింగ్ యార్డు!!

● టీడీపీ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం

● వైసీపీ వచ్చాక నిర్లక్ష్యం

● అధ్వానంగా తయారైన ఆహ్లాద కేంద్రం



ప్లాస్టిక్ కవర్లతో నిండిన నెక్లెస్ రోడ్డు



చెరువు నీటిలో పేరుకున్న వ్యర్థాలు

నెల్లూరుకు మణిహారంగా, నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే కేంద్రంగా రూపొందించిన నెక్లెస్ రోడ్డు నాస్టీ రోడ్డుగా మారింది. గత టీడీపీ ప్రభుత్వంలో నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ(నుడా)ను ఏర్పాటు చేసిన తర్వాత నగరాభివృద్ధిలో భాగంగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా నెక్లెస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అధికారంలోకి వచ్చిన పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా డంపింగ్‌యార్డుగా, దుర్గంధం నిలయంగా తయారైంది. - నెల్లూరు (సాంస్కృతికం)

హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న ట్యాంకు బండ్ మాదిరిగా నెల్లూరు స్వర్ణాల చెరువు వద్ద నెక్లెస్ రోడ్డును నిర్మించేందుకు నాటి మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ ప్రత్యేక చొరవ చూపారు. దాదాపు రూ.30 కోట్ల వ్యయంతో ఇరుకళల పరమేశ్వరి ఆలయం నుంచి బారాషహీద్ దర్గా వరకు చెరువు కట్టమీద దాదాపు 1.50కి.మీల పొడవున రోడ్డు నిర్మాణం ప్రతిపాదనలతో పనులు చేపట్టారు. అలాగే ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద ఘాట్ నిర్మించారు. సిమెంటు రోడ్డు, ఫుడ్ కోర్టులు, ప్రముఖుల విగ్రహాల ఏర్పాటు... ఇలా 90 శాతం పనులు పూర్తి చేశారు. అయితే 2019 ఎన్నికలతో వైసీపీ అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చేసిన పనులు కూడా ధ్వంసమయ్యాయి. కార్తీక దీపోత్సవం, గంగా హారతులు, గణేష్ నిమజ్జనం వంటి పెద్ద కార్యక్రమాలు ఈ ఘాట్‌లోనే జరిగాయి. ఈ సందర్భంగా మరో రూ.6కోట్లు వెచ్చించి నెక్లెస్ రోడ్డుకు మరమ్మతులు చేయించారు. అయితే నిర్వహణ లోపం వల్ల ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. నగర పాలక సంస్థ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం నెక్లెస్ రోడ్డు డంపింగ్ యార్డు (చెత్త కుండీ)ను గుర్తుకు తెస్తోంది. చెరువంతా గుర్రపు డెక్క ఆకుతో నిండిపోయింది. పిచ్చిమొక్కలు పెరగడం, మల-మూత్ర విసర్జనతో పచ్చదనం, ఆహ్లాదం ఆవిరయ్యాయి.

నెక్లెస్ రోడ్డు ఏర్పాటు చేసిన కొత్తల్లో ఉదయం, సాయంత్రం మార్నింగ్‌వాక్ చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చేవారు. సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో సేదతీరేరు. ప్రస్తుతం ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇక్కడికి రావాలంటేనే భయపడిపోతున్నారు. వచ్చినా కూడా అక్కడి దుర్గంధాన్ని భరించలేక తక్షణం వెళ్లిపోతున్నారు. ఈ ప్రాంతంలోనే నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయం ఉంది. అలాగే, స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ శరవేగంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో నెక్లెస్‌రోడ్డు, దాని పరిసరాలను ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాల్సి ఉండగా పాలకులు, అధికారులు ఐదేళ్లగా ప్రకటనలతోనే కాలం గడిపేశారు. ఇప్పటికైనా యంత్రాంగం పూనుకుని తక్షణ చర్యలు చేపట్టకపోతే చెరువు పరిసరాలు మరింత అధ్వానంగా మారి, అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నెక్లెస్ రోడ్డుపై డివైడర్‌లో వ్యర్థాలు



రోడ్డు పక్కన పేరుకున్న చెత్త కుప్పలు



పిచ్చిమొక్కలతో నిండిన రోడ్డు గట్టు



ఘాట్ మెట్లపై ఊడిపోయిన రాళ్లు

టీడీపీలోకి చేరికలు పెరుగుతాయి : కోటంరెడ్డి సోదరులు



వీపీఆర్ సమక్షంలో పార్టీలో చేరినవారితో కోటంరెడ్డి సోదరులు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ వరకు టీడీపీలోకి వివిధ పార్టీల నాయకుల చేరికలు జరుగుతూనే ఉంటాయని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో గురువారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఇతర పార్టీలకు చెందిన నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త, పాతవారిని కలుపుకుని నెల్లూరు రూరల్‌ను టీడీపీ కంచుకోటగా తయారు చేస్తామన్నారు. అనంతరం అన్నంగి రమణయ్య యాదవ్, డబ్బుగుంట వెంగయ్య, పాలకుర్తి శ్రీనివాసులు, ఆమంచర్ల గ్రామానికి చెందిన కూకటి వెంకట కృష్ణయ్య, సుధాకర్, పెంచలయ్య, పోలయ్య, అంబాపురానికి చెందిన కర్నాల అనిల్, ఇటీవల వైసీపీలో చేరిన 29వ డివిజన్‌కు చెందిన మహిళా నేత దేవి, దిలీప్‌కు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

నేడు కోటంరెడ్డి నామినేషన్ దాఖలు

నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. తన కార్యాలయం నుంచి హంగు, ఆర్భాటాలకు దూరంగా నిరాడంబ రంగా వెళ్లి మధ్యాహ్నం 1.20 నుంచి 1.40 గంటల మధ్య నామినేషన్ వేయనున్నారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున గెలిచిన శ్రీధర్‌రెడ్డి ఈ సారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విషయం విదితమే.

అగ్నిప్రమాదాలపై అవగాహన

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 18: విద్యార్థి దశ నుంచే అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయాధికారి ఎస్ వేణుగోపాల్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ధనలక్ష్మీపురంలోని సిల్వర్‌వోక్స్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు స్పందించాల్సిన తీరును వివరించారు.

వెంకటేష్‌కు అభినందన

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 18 : సివిల్స్ ఫలితాల్లో 467 ర్యాంకు సాధించిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాన్న వెంకటేష్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య అభినందించి సన్మానించారు. పీఎంపీ అసోసియేషన్ సభ్యుడు బైరి శంకర్రావ్ బంధువైన వెంకటేష్ నెల్లూరుకు వచ్చిన సందర్భంగా గురువారం డీఎంహెచ్‌వోను కలిశారు.

కోదండరాముడి బ్రహ్మోత్సవాల ప్రారంభం

● కొనసాగుతున్న నవమి ఉత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 : నగరంలోని ఉస్మాన్ సాహెబ్‌పేట కోదండరామ స్వామి ఆలయంలో గురువారం రాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 28 వరకు జరుగుతాయి. తొలిరోజు అంకురార్పణ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అగ్ని ప్రతిష్ఠ, విశేష పూజలు జరిగాయి. ఈవో దుర్గయ్య పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, రాత్రి శేషవాహన సేవ జరగనున్నాయి. కాగా, నగరంలోని పలు వైష్ణవాలయాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పంగునోత్తర కళ్యాణ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రంగనాయకమ్మకు గురువారం ఉదయం తిరుమంజనం, సాయంత్రం పురాణ పఠనం, ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవ జరిగాయి.

● సంతపేట ఆంజనేయస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి సింహవాహనంపై పేట ఉత్సవం జరిగింది.

● వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరంలో బాబా జన్మదిన వేడుకలు, శ్రీరామనవమి ఉత్సవాల్లో గురువారం రాత్రి శ్రీరామచంద్ర స్వామికి శేష వాహన సేవ కనుల పండువగా జరిగింది. ఉదయం తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ, సామూహిక శివసహస్ర నామార్చన చేశారు. గురుకృపా కళాక్షేత్రం చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

● గాంధీనగర్ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం బాబాకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర నామ పూజలు జరిగాయి. బాలాజీ నగర్ సాయిదర్బార్‌లో శ్రీరామనవమి, బాబా జన్మదిన వేడుకలు బుధవారం రాత్రితో ముగిశాయి.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 18 : ది ఆర్యవైశ్య బులియన్స్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నబజారులో గురువారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభమైంది. విజిలెన్స్ ఎస్పీ కే రాజేశ్వరరెడ్డి దీనిని ప్రారంభించారు. వ్యాపారులు సామాజిక సేవ చేయడం అభినందనీయమన్నారు. డీఎస్టీవో విష్ణురావు, సీఐ వీ సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, కార్యదర్శి ఎంపీ ఆంజనేయులు, ప్రాజెక్టు డైరెక్టర్ సొల్లేటి వినాయకరావు పర్యవేక్షించారు.

కూటమి ప్రభుత్వంతో నవశకం : కేతంరెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 18 : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో నవశకం మొదలు కానుందని ఆ పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణను గెలిపించాలని కోరుతూ 48వ డివిజన్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలంతా కూడా తమకు అండగా ఉండి రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

27న పాలిసెట్ పరీక్ష

కావలి రూరల్, ఏప్రిల్ 18: ఈ నెల 27వ తేదీన పాలిసెట్-2024 పరీక్షలు నిర్వహించనున్నట్లు రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సుశీల్ కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల, కావలి పట్టణం ఉదయగిరిరోడ్డులోని విశ్వోదయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్లు ఇంటర్నెట్ సెంటర్‌లో, లేదా రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాలలో తీసుకోవచ్చని తెలిపారు. పరీక్షల ప్రిపరేషన్‌కు విశ్వోదయ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత కోచింగ్ ఇస్తున్నారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9642255592, 9949022772, 9440707944ను సంప్రదించాలని పేర్కొన్నారు.

యువత సంక్షేమమే టీడీపీ లక్ష్యం

మాజీ మంత్రి పొంగూరు నారాయణ



పార్టీలో చేరిన వారితో కలిసి విజయ సంకేతం చూపుతున్న నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 18 : యువత సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తోందని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నగరంలోని 53, 54 డివిజన్లలో ఆయన పర్యటించారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసి నిరుద్యోగులుగా నిరాసతో ఉన్న యువతకు తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఏ రాష్ట్రంలో అయినా పరిశ్రమలు పెరగడంతోపాటు అన్ని రకాల వ్యాపారాలు వృద్ధి చెందితేనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కానీ, గత ఐదేళ్లలో రాష్ట్రంలో అలాంటి పరిస్థితులు లేకపోవడంతో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ప్రజలంతా టీడీపీకి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పొంగూరు రమాదేవి, సింధూర, శరణి, మహిళా శక్తి టీమ్ పాల్గొన్నాయి. 4వ డివిజన్‌లో నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, 44వ డివిజన్‌లో నారాయణ కుమార్తె సింధూర ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

టీడీపీలో చేరిన వలంటీర్లు...

నారాయణ సమక్షంలో నగరంలోని 8వ డివిజన్‌కు చెందిన షేక్ షఫీ మిత్ర బృందంతోపాటు పలువురు వలంటీర్లు టీడీపీలో చేరారు. నగరంలోని గోమతి నగర్‌లో గల నారాయణ క్యాంపు కార్యాలయంలో గూడూరు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారికి నారాయణ కండువాలు కప్పి ఆహ్వానించారు.

తొలిరోజు 16 నామినేషన్లు

తిరుపతి ఎంపీకి ఒకటి... ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లకు 15దాఖలు.... గూడూరుకు నిల్



శ్రీకాళహస్తిలో నామినేషన్ వేసేందుకు ఊరేగింపుగా వస్తున్న టీడీపీ అభ్యర్థి సుధీర్ రెడ్డి

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తొలిరోజే తిరుపతి జిల్లాలో 16మంది నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి, ఆరు అసెంబ్లీ స్థానాలకు 15 చొప్పున దాఖలయ్యాయి. 16 మంది అభ్యర్థులు మొత్తంగా 21సెట్ల నామినేషన్లు సమర్పించారు. తిరుపతి పార్లమెంటు స్థానానికి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున రిటైర్డు ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ తిరుపతిలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఎదుట నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.తిరుపతి అసెంబ్లీకి ఏడుగురు అభ్యర్థులు పది సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీకాళహస్తి నుంచీ ముగ్గురు ఐదు సెట్ల నామినేషన్లు వేశారు. సత్యవేడుకు రెండు, సూళ్ళూరుపేట, వెంకటగిరి, చంద్రగిరి స్థానాలకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. గూడూరు అసెంబ్లీ స్థానానికి తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా వేయలేదు.



చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానీ నామినేషన్

చంద్రగిరి, శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు

చంద్రగిరి అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి పులివర్తి వెంకట మణిప్రసాద్ అలియాస్ పులివర్తి నానీ నామినేషన్ దాఖలు చేశారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ కేంద్రానికి ఆయన తన సతీమణి సుధారెడ్డితో కలసి వాహనంలో వెళ్ళారు. పోలీసులు కార్యాలయ ఆవరణలోకి వాహనాన్ని అనుమతించలేదు. సుధారెడ్డి కాలికి గాయమైనందున నడవలేనని చెప్పడంతో తర్వాత వాహనాన్ని అనుమతించారు. గాయంతో నడవలేని స్థితిలో నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు వచ్చిన తమను వాహనం అడ్డుకుని ఇబ్బంది పెట్టడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ మీడియాకు చెప్పారు. కాగా శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అట్టహాసంగా వేలాదిమంది కార్యకర్తలు, అనుచరులతో ఊరేగింపుగా వెళ్ళి నామినేషన్ వేశారు. ఆయన రెండు సెట్లు, ఆయన సతీమణి బొజ్జల రిషిత రెండు సెట్లు చొప్పున నామినేషన్లు వేశారు.నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి రావడం, బాణాసంచా భారీ ఎత్తున పేల్చడంతో పట్టణమంతా సందడి నెలకొంది. నామినేషన్ దాఖలు చేసిన సమయంలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, బీజేపీ నేత కోలా ఆనంద్ తదితరులు ఆయన వెంట వున్నారు. భారత చైతన్య యువజన పార్టీ తరపున దినద్ బాబు నామినేషన్ దాఖలు చేశారు.

నాలుగు సెగ్మెంట్లలో వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు

తిరుపతిలో వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు వేయగా మరో ఆరుగురు ఇండిపెండెంట్లుగా నామినేషన్ పత్రాలు సమర్పించారు.సూళ్ళూరుపేటలో వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య నామినేషన్ వేశారు. వెంకటగిరిలో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ పత్రాలను ఆయన తల్లి రాజ్యలక్ష్మి ఆర్వోకు సమర్పించారు. సత్యవేడులో వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్ తరపున ఆయన సతీమణి చైతన్య భాను నామినేషన్ వేశారు.ఆ సందర్భంగా రాజేశ్ నామినేషన్ కేంద్రం వెలుపలే వున్నారు. అక్కడే కాంగ్రెస్ అభ్యర్థిగా బాలగురవం బాబు కూడా నామినేషన్ పత్రాలు అందజేశారు.

నామినేషన్ల స్వీకరణా? స్క్రూట్నీయా?

● రెండు గంటలపాటు ఆర్వో కార్యాలయంలోనే వైసీపీ అభ్యర్థి

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హోదాలో కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ప్రెస్‌మీట్ పెట్టి చెప్పిన అరగంటలోనే నిబంధనలు తుంగలో తొక్కారన్న విమర్శలు వచ్చాయి.వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ రెడ్డి గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మేయర్ డాక్టర్ శిరీష,డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలిసి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.ఆర్వో అదితిసింగ్ నామినేషన్లు స్వీకరించి, సూత్రప్రాయంగా పరిశీలించి అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చి పంపాల్సి ఉంటుంది.ఆమె అలా చేయకుండా రెండు గంటలు పాటు అభ్యర్థిని,ఆయనతో వచ్చినవారిని కార్యాలయంలో కూర్చోబెట్టుకుని నామినేషన్ దరఖాస్తును ఆసాంతం పరిశీలించినట్టు తెలుస్తోంది.గంట పాటు ఆమె పరిశీలించాక ఏఆర్వోగా ఉన్న మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు ఇచ్చినట్టు తెలిసింది. ఆయన మరో గంట నామినేషన్ పత్రాలను పరిశీలించి అంతా 'ఓకే' అన్న తర్వాత అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చి పంపారు. పక్కనేవున్న ఆర్డీవో కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని తన భార్య సుధారెడ్డితో కలసివచ్చి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కేవలం పదినిమిషాల్లోనే ఈ తంతును పూర్తిచేశారు. అయితే అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రెండు గంటలు గడుస్తున్నా లోపలివారు బయటకు రాకపోవడం చర్చగా మారింది.ఈనెల 26న నామినేషన్ల స్క్రూట్నీ ఉంటుంది.అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను పరిశీలించి, నిబంధనలకు లోబడి ఉన్నవాటిని పోటీ జాబితాలో పొందుపరుస్తారు. అందుకే కొందరు అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లను దాఖలు చేస్తుంటారు.మరి తిరుపతి ఆర్వోవ్యవహరించిన తీరుపై నామినేషన్ల తొలిరోజే విమర్శలు రావడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.కాగా అభినయ్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు వేయగా అతని స్నేహితులు పెంచల ప్రసాద్, ఆర్.కృష్ణ చైతన్య, బండ్ల చంద్రశేఖర్, బ్యంగి నవీన్, సోమశేఖర్ రెడ్డి, శేఖర్ ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఏజెంట్ పాఠాలు, బూత్ ఏజెంట్ల కోసమే ఈ ఆరుగురితో నామినేషన్లు వేయించారన్న ఆరోపణలొచ్చాయి.

ఎన్నికల నోటిఫికేషన్ జారీ

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉదయం 10.30 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీ ప్రవర్తనా నియమావళిని ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.వచ్చే నెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని ఆ రోజు, మరుసటి రోజు జిల్లావ్యాప్తంగా సీఆర్‌పీసీ 144వ సెక్షన్ అమలు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. 13వ తేదీ పోలింగ్ వుంటుందని, ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగి రీపోలింగ్ అనివార్యమైతే మరుసటి రోజైన 14వ తేదీ నిర్వహించాల్సి వుంటుందన్నారు. దానికోసం ఆ రెండు తేదీల్లో 144వ సెక్షన్ అమల్లో వుంటుందన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను 25న నిర్ణయిస్తాం : కలెక్టర్

ఎన్నికల కమిషన్ నియమించిన జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు 25వ తేదీన వచ్చాక జిల్లా ఎన్నికల చరిత్రను పరిశీలిస్తారన్నారు.ఆర్వో సమావేశమై సమీక్షించాక ఏయే పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమో నిర్ణయిస్తారని వివరించారు.ఆయా కేంద్రాల్లో అదనపు పోలీసు బందోబస్తుతో పాటు వెబ్ కాస్టింగ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

మే 2-8 నడుమ పోస్టల్ బ్యాలెట్ల సేకరణ

జిల్లాలోని సర్వీసు ఓటర్లకు మే నెల 2వ తేదీ నుంచీ 8వ తేదీ నడుమ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 30వేలమంది సర్వీసు ఓటర్లు వున్నారన్నారు. వారి కోసం ప్రతి నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.అక్కడినుంచీ బ్యాలెట్ పత్రాలు తీసుకుని 8వ తేదీ లోపు ఫెసిలిటేషన్ సెంటర్లలో అందజేయవచ్చునని వివరించారు.

చంద్రగిరికి అదనంగా మరో ఆర్వో

చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం తిరుపతి జిల్లాలో వున్నప్పటికీ అది చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోకి వస్తుందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా ఎన్నికల అధికారిగా ఆ నియోజకవర్గంలో పోలింగ్, కౌంటింగ్‌లకు తానే బాధ్యుడినన్నారు. అలాగే అసెంబ్లీ సెగ్మెంట్ ఫలితాలు కూడా తామే ప్రకటిస్తామన్నారు. అయితే ఆ సెగ్మెంట్‌కు సంబంధించి ఎంపీ ఓట్ల లెక్కింపు చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంతో ముడిపడి వున్నందున ఇక్కడి రౌండ్ వారీ ఫలితాలను చిత్తూరు కలెక్టర్‌కు తెలియజేస్తామని, వారు మిగిలిన సెగ్మెంట్లతో కలుపుకుని రౌండ్ల వారీ ఫలితాలను ప్రకటిస్తారని వివరించారు. ఓట్ల లెక్కింపు ఇక్కడే నిర్వహిస్తున్నప్పటికీ ఈ అదనపు పని కోసం ప్రత్యేకంగా ఆ నియోజకవర్గానికి కౌంటింగ్ సందర్భంలో అదనంగా మరో రిటర్నింగ్ అధికారిని నియమిస్తామన్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని సర్వేపల్లి సెగ్మెంట్ సైతం ఈ జిల్లా పరిధిలో కాకుండా నెల్లూరు జిల్లా పరిధిలో వుందని గుర్తు చేశారు. ఆ సెగ్మెంట్ ఎంపీ ఫలితాలను రౌండ్ వారీ నెల్లూరు జిల్లా నుంచీ తెలుసుకుని ఇక్కడి సెగ్మెంట్ల ఓట్లతో కలుపుకుని రౌండ్ వారీ ప్రకటించాల్సి వుంటుందన్నారు.మీడియా సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ కూడా పాల్గొన్నారు.

రేపు గూడూరుకు చంద్రబాబు

● సాయంత్రం సత్యవేడులో బహిరంగసభ

● 29న తిరుపతికి పవన్ కళ్యాణ్

తిరుపతి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 20న, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈనెల 29న జిల్లాకు రానున్నారు. శనివారం ఉదయం చంద్రబాబు గూడూరు చేరుకుంటారు. అక్కడ ఆర్టీసీ బస్టేషన్ సమీపంలోని సీఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో మహిళలతో ముఖాముఖీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం గూడూరు నుంచీ నెల్లూరు జిల్లా సర్వేపల్లి వెళ్ళి అక్కడ జరిగే బహిరంగసభకు హాజరవుతారు. అక్కడి నుంచీ సాయంత్రం తిరిగి సత్యవేడుకు చేరుకుని బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తారు. గూడూరులో అదే రోజు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ నామినేషన్ కార్యక్రమం వున్నప్పటికీ చంద్రబాబు పర్యటన కోసం నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నారు. కాగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఈనెల 29న తిరుపతిలో పర్యటించనున్నారు. ఆ రోజు మొత్తం ఆయన తిరుపతిలోనే గడుపుతారని సమాచారం. నగరంలోని ప్రధాన మార్గాల్లో రోడ్ షో వుంటుందని తెలిసింది. బహిరంగసభ నిర్వహిస్తారా లేక రోడ్‌షోలోనే ప్రధాన కూడళ్ళలో ప్రసంగిస్తారా అన్నది ఇంకా ఖరారు కాలేదు.

ధాన్యం ధరల పతనం

● బ్రోకర్ల సిండికేట్ దెబ్బకు తీర ప్రాంత రైతు విలవిల



కోట, ఏప్రిల్ 18: ఈ ఏడాది మొదట్లో ఆశాజనకంగా వుండిన ధాన్యం ధరలు బ్రోకర్ల సిండికేట్ దెబ్బతో పతనమయ్యాయి. రెండు నెలల వ్యవధిలో ధాన్యం బ్రోకర్లు సిండికేట్‌గా మారి బయటి రాష్ట్రాల్లో ధరలు బాగున్నప్పటికీ మిల్లర్లు ధాన్యాన్ని అడగడం లేదంటూ చేతులెత్తేశారు. ధాన్యం ధరలు పడిపోయాయని ప్రచారం సాగించారు.సముద్రతీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రైతులు ఎక్కువభాగం బీపీటీ 5204 (పెద్దజిలకర), నెల్లూరు జిలకర్ర, 1010 ధాన్యాన్ని సాగు చేస్తున్నారు.కోతలు చివరి దశకు చేరుకోవడంతో పాటు దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఆనందంగా వున్న రైతులు ధాన్యం ధరలు పడిపోయాయంటూ ప్రచారం ఊపందుకోవడంతో హతాశులయ్యారు.మొదట్లో రూ.23,500 పలికిన బీపీటీ 5204 రకం ప్రస్తుతం రూ.21 వేలకు పడిపోయింది. ఆ రేటుకు కూడా ధాన్యం అడిగే నాథుడేలేడని బ్రోకర్లు ప్రచారం చేస్తున్నారు.మొన్నటి వరకు నెల్లూరు జిలకర్ర రూ.17వేలకు పైగా పుట్టి ధాన్యం పలుకుతుండగా, ప్రస్తుతం రూ.15వేలు మాత్రమే ఇస్తామంటున్నారు.1010 రకం ధాన్యం పుట్టి రూ.17,200 పలుకుతుండగా ప్రస్తుతం రూ.15వేలకు కూడా అడిగే నాథుడే లేకుండా పోయారని రైతులు వాపోతున్నారు. చెన్నైలోని రెడ్‌హిల్స్, కర్ణాటకలోని తుంకూరు ప్రాంతాల్లో ధాన్యానికి మంచి ధర వున్నప్పటికీ రైతుల వద్ద ధాన్యం నిల్వలను ఆసరాగా చేసుకొని బ్రోకర్లు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించేశారు. కోట, చిట్టమూరు మండలాల్లో ధాన్యం కోతలు జరుగుతూనే ఉండగా కొన్ని గ్రామాల్లో రైతుల వద్ద ధాన్యం నిల్వలున్నాయి. ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో రైతులు చేసేదిలేక నిల్వ ఉన్న ధాన్యాన్ని అందినకాడికి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది దిగుబడులు బాగుండడం...మంచి ధరలు పలకడం చూసి ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నారు.

చిత్తూరు జిల్లాలో 15 నామినేషన్లు

● కుప్పం, పూతలపట్టుల్లో నిల్





నగరిలో భారీ ర్యాలీగా నామినేషన్ వేయడానికి వస్తున్న టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18:చిత్తూరు జిల్లాలో తొలిరోజైన గురువారం చిత్తూరు పార్లమెంటు స్థానానికి 1, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు 14 నామినేషన్లు దాఖలయ్యాయి. కుప్పం, పూతలపట్టు నియోజకవర్గాలకు బోణీ కాలేదు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి టీడీపీ తరపున దగ్గుమళ్ల ప్రసాదరావు నామినేషన్ దాఖలు చేశారు.పుంగనూరు స్థానానికి టీడీపీ తరపున చల్లా రామచంద్రారెడ్డి, చల్లా పూజారెడ్డి, కాంగ్రెస్ నుంచి జి.మురళీమోహన్, సోషియల్ డెమోక్రటిక్ పార్టీ నుంచి ఖాన్దాది షేక్ అన్వర్ బాషా నామినేషన్ దాఖలు చేశారు.నగరి నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ అభ్యర్థి జి.భానుప్రకాష్ భారీ జన సందోహంతో తరలివచ్చి నామినేషన్ వేశారు.తెలుగుతమ్ముళ్లు స్వచ్ఛందంగా పదివేల మందికి పైగా తరలిరావడంతో నగరి కిక్కిరిసిపోయింది. వినాయకస్వామి ఆలయం నుంచి ర్యాలీగా టవర్‌క్లాక్ మీదుగా తహసీల్దారు కార్యాలయానికి తరలివెళ్లారు. పార్టీ నేత ప్రతాప్ రాజు ప్రతిపాదించగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీరెడ్డిలతో కలిసి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. గంగాధరనెల్లూరుకు టీడీపీ తరపున గాంధీ రత్నవేలు, స్వతంత్ర అభ్యర్థిగా ఉసురుపాటి పద్మనాభం నామినేషన్ దాఖలు చేశారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి మూడు సెట్లు, టీడీపీ అభ్యర్థి జీసీ జగన్ మోహన్ రెండుసెట్ల నామినేషన్ వేశారు. పలమనేరు నియోజకవర్గానికి వైసీపీ తరపున ఎన్.వెంకటేగౌడ, ఎన్.పావని నామినేషన్ దాఖలు చేశారు.

అడవిలో ఆగని కార్చిచ్చు



తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం పచ్చదనంతో దర్శనమిచ్చే శేషాచల అడవి అగ్నికి ఆహుతవుతోంది. మంగళవారం ఉదయం సానబండరాళ్ల ప్రాంతంలో అడవికి నిప్పంటుకున్న విషయం తెలిసిందే. వేసవికి ఎండిపోయిన ఆకులు, చెట్లు భారీగా ఉన్న క్రమంలో మంటలు క్రమంగా వ్యాప్తి చెందుతూ వస్తున్నాయి. తిరుమలకు దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం, మొదటి ఘాట్‌కు సమీపంలోని అడవిలో మూడ్రోజుల కిందట మొదలైన మంటలు గురువారానికి కూడా అదుపులోకి రాకపోవడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ సిబ్బంది ఎంత శ్రమించినా మంటలు అదుపులోకి రావడం లేదు. ఘాట్ దిశగా వ్యాప్తి చెందుతున్నాయి. మరోవైపు అడవిలోని అనేక వన్యప్రాణుల్లో కొన్ని మంటల నుంచి దూరంగా వెళ్లిపోగా, మరికొన్ని కాలిపోతున్నట్లు సమాచారం. మంటలు వ్యాప్తి చెందుతుండటంతో దట్టమైన పొగ అడవులను కమ్మేస్తోంది. తిరుపతి నగర ప్రజలకు కూడా ఈ పొగ స్పష్టంగా కనిపిస్తోంది. కాగా, మంటల ద్వారా వచ్చిన బూడిద గాల్లో కలిసి. స్థానికులు నివాసం ఉండే బాలాజీనగర్‌లోని ఇళ్లపై పడుతోంది.



అమ్మవారి మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు

కమనీయం.. కోదండరాముడి కల్యాణం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 18: తిరుపతిలోని కోదండరామాలయంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయంలోని విద్యుత్ అలంకరణల మధ్య వెలుగులీనే వేదికపై అర్చక స్వాములు ఆదిదంపతుల కల్యాణం కమనీయంగా జరిపించారు. అంతకు ముందు ఉదయం కపిలతీర్థం రోడ్డులోని టీటీడీ పరిపాలనా భవనం నుంచి తలంబ్రాల కోసం ముత్యాలను ఏనుగుపై ఊరేగింపుగా తీసుకువచ్చి కోదండ రామాలయం ప్రధాన అర్చకులు ఆనందకుమార్ దీక్షితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీయరు స్వాములు, వేదపండితులు, డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



ఏనుగుపై ముత్యాల తలంబ్రాల ఊరేగింపు

శ్రీవారి ఆలయంలో వైభవంగా శ్రీరామపట్టాభిషేకం

తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిఆలయంలో గురువారం రాత్రి శ్రీరామపట్టాభిషేకం వైభవంగా జరిగింది. సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు సీతారామ లక్ష్మణ అంజనేయస్వామి ఉత్సవమూర్తులకు విశేష సమర్పణ చేపట్టారు. సాయంత్రం ఐదు నుంచి 5.30 గంటల వరకు సహస్రదీపాలంకార సేవ నిర్వహించారు. తర్వాత సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని బంగారువాకిలి చెంత ఉత్సవర్లను వేంచేపు చేసి, అర్చకులు శ్రీరామపట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సుగ్రీవుడు, అంగదుడు ఉత్సవమూర్తులను వేంచేపు చేసి వారితోపాటు ఆంజనేయస్వామికి పుష్పమాలలను సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
ఆంధ్రజ్యోతి జన చైతన్యం
6 www.andhrajyothy.com
శుక్రవారం 19 ఏప్రిల్ 2024



కలువాయి : దాచూరులో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఓటరు అనే నేను...

ప్రతిఒక్కరూ ఓటుహక్కును తప్పక వినియోగించుకోవాలని అధికారులు ఓటర్లను చైతన్యవంతులు చేస్తున్నారు. అందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఓటుహక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని ప్రతిజ్ఞ చేయించారు. శుక్ర, శనివారాల్లో కూడా ఎస్సీ కాలనీల్లో ఓటర్లను చైతన్యవంతులు చేసే కార్యక్రమం చేపడతామని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు.

- కలువాయి

అభ్యర్థి ఖర్చుకు చందాలేసి ఇచ్చేటోళ్లం!



మా రోజుల్లో

మా కాలంలో ఎలచ్చన్లకు.. ఇప్పుడు ఎలచ్చొన్లకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందయ్యా. అప్పట్లో ఇప్పటిలాగా మైకాల మోతల్లేవ్.. కరపత్రాల పంపిణీ లేదు.. గిర్రుగిర్రున తిరిగే కార్లూ లేవు. ప్రజలకు డబ్బులు ఇచ్చే చేసే ఆనవాయితీ లేదు. సేవాగుణం, పేరు ప్రఖ్యాతలు, కుటుంబ నేపథ్యం ఉన్న వ్యక్తులే పోటీలో నిలబడేవారు. ప్రజలు కూడా గ్రామపెద్ద సూచించిన వ్యక్తికే గుత్తగా ఓట్లు వేసి మాట మీద నిలబడేవారు. అభ్యర్థుల ఖర్చు కూడా రూ.వేలల్లో ఉండేది. కొన్ని గ్రామాల్లో ప్రజలే చందాలు వేసుకొని పోటీలో నిలబడ్డ వ్యక్తికి డబ్బులు ఇచ్చేటోళ్లు. కానీ ఇప్పుడంతాలేదు. ఎన్నికలంటేనే డబ్బుమయంగా మారి పోయింది. ఆర్థిక నేరస్థులు, రౌడీలు, హత్య కేసుల్లో నిందితులు సైతం ఎలచ్చన్లో నిలబడతా ఉండారు. ఇవన్నీ ప్రజలు గమనించాలి. భావితరాలను గుర్తు చేసుకుని అభివృద్ధి చేసేటోళ్లనే గెలుపువించుకోవాలి.

- గూడూరు శివరామయ్య (90), గండిపాళెం, ఉదయగిరి మండలం

విజ్ఞతతో ఆలోచించి ఓటేద్దాం



యువగళం

ఎన్నికల షెడ్యూలు విడదలైన నాటి నుంచి తొలి ఓటు వేస్తున్నాననే ఆలోచన సంతోషం కలిగిస్తోంది. నేను బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. చదువుకున్న యువత విజ్ఞతతో ఆలోచించి రాష్ట్రాభివృద్ధికి పాటు పడే వారికి ఓటు వేస్తే భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటుంది. గడిచిన ఐదేళ్లలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. చదువుకోసమే కాదు.. ఉపాధి కోసమూ బయట రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఆశలు పెట్టేవారిని దూరంగా పెట్టి అవకాశాలు కల్పించే నాయకుడ్ని ఎన్నుకోవడానికి రానున్న ఎన్నికలో తొలి ఓటు వినియోగిస్తాం.

- శ్రీహర్షవర్ధన్ రెడ్డి, కలిగిరి

కఠినంగా ఎన్నికల ఆంక్షలు

- నెల్లూరు నగర రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్



సార్వత్రిక ఎన్నికలలో తొలిఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ మొదలైనందున కార్పొరేషన్ కార్యాలయం పరిసరాల్లో ఎన్నికల ఆంక్షలు కఠినంగా అమలు చేస్తున్నట్లు నెల్లూరు నగర నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ వెల్లడించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన పత్రాలు తన కార్యాలయంతోపాటు నెల్లూరు ఆర్డీవో, సిటీ తహసీల్దారు కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉందని అన్నారు. కార్యాలయానికి 100 మీటర్లలోపు ర్యాలీ, ఊరేగింపులను ఆపేయాలని సూచించారు. 144 సెక్షను అమల్లో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగనివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సిటీ నియోజకవర్గంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని, ఇరగాళమ్మ సంఘం, చిల్డ్రన్స్‌పార్కు, పాతచెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

- నెల్లూరు (సిటీ)



విజయం కోసం...

ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ కందుకూరు టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య గురువారం సుదర్శన నారసింహ యాగం నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 11మంది రుత్వికులు శాస్త్రోక్తంగా సుదర్శనయాగం క్రతువు నిర్వహించారు.

- కందుకూరు



లైనింగ్ చేయకుండా వదిలేసిన కనిగిరి ప్రధాన కాలువ

ఆ మాటలు తలుచుకొని

'ఆత్మ' ఘోషిస్తోంది!

- ఆత్మకూరు నియోజకవర్గానికి రూ.85 కోట్లు అన్నారు... పైసా విదల్చలేదు!

సంగం, ఏప్రిల్ 18 : అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని సీఎం జగన్ హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా వాటి ఊసేలేదు. ఆ హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో జగనన్న మాట ఇచ్చి మడమ తిప్పారని ప్రజలు విమర్శిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 2022 సెప్టెంబరు 6న సంగం బ్యారేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆత్మకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సుమారు రూ. 85 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంతో గొప్పగా ప్రకటించారు. దీంతో పలు సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలంతా సంబరపడ్డారు. కానీ సీఎం హామీ ఇచ్చి ఏడాదిన్నర పూర్తైంది. కానీ పైసా కూడా విడుదలయిన దాఖలాలు లేవు.



సంగం : అధ్వానంగా ఉన్న వంగల్లు - మర్రిపాడు రహదారిపై ఎర్రమట్టి తోలి గుంతలు పూడ్చిన ఆటో డ్రైవర్లు



సీఎం ఇంకా ఏం చెప్పారంటే...

మోసం గురూ!

- సంగం - నెల్లూరు జాతీయ రహదారి నుంచి సంగం బ్యారేజీ వరకు రహదారి నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ఆ ఊసేలేదు.
- సంగం గ్రామ ప్రజలకు పెన్నానది నుంచి తాగునీటి పథకం కోసం సుమారు రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అది కొండెక్కింది.
- ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోల ని 12 ఇరిగేషన్ పనులకు సుమారు రూ. 40 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

కానీ ఒక్క ఇరిగేషన్ పనికి కూడా ప్రారంభం కాలేదు.

- ఆత్మకూరు మున్సిపాలిటీకి స్పెషల్ గ్రాంట్ కింద రూ. 12 కోట్లు ఇస్తామన్నారు. అదీ లేదు.
- నియోజకవర్గ పరిధిలోని 25 గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారుల నిర్మాణానికి రూ. 14 కోట్లు ఇస్తామని ప్రకటించారు. కానీ వాటి అతీగతీలేదు.

కలగానే పట్టణాభివృద్ధి

ఆత్మకూరు : జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చాక సీఎంగా ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి రూ. 12 కోట్లు మంజూరు చేస్తామని చెప్పినా, నిధులు విడుదలకాకపట్టణ సుందరీకరణ అలాగే మిగిలి ఉంది. అలాగే పట్టణ సమీపంలో ఉన్న చెరువు వద్ద 1.5 కి.మీ మేర అహ్లాదకరంగా ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ. 4కోట్లు మంజూరుకు రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గతంలో కోటిరూపాయలతో బట్టేపాడు రోడ్డు సమీపంలో అర్థంతరంగా ఆగిపోయిన పార్కు నిర్మాణం పనులు పునరుద్ధరణలో భాగంగా రూ. 2 కోట్లతో 3 ఎకరాల్లో పార్కు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. వీటిలో దేనికీ కూడా నిధులు మంజూరు కాలేదు. కాగా ఆత్మకూరు సమీపంలోని అశ్వనీపురం, జంగాలపల్లి మీదుగా రింగ్ రోడ్డు నిర్మాణానికి అధికారులు సర్వే చేశారు. నిధులు రాక పనులు ప్రారంభం కాలేదు.

- యాత్రలో ఇచ్చిన హామీలూ అంతే..

జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంకల్ప యాత్రలో భాగంగా 2018 ఫిబ్రవరి 6న సంగం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటికే 75 శాతం పూర్తయిన సంగం బ్యారేజీని ఏడాదిలోపు పూర్తి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. సీఎం అయిన మూడున్నర ఏళ్లకు బ్యారేజీ పూర్తి చేయకుండానే ప్రారంభించారు. నేటికీ 2శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా రూ. 20 కోట్ల బిల్లులు కాంట్రాక్టరుకు బకాయిలు ఉన్నాయి. బ్యారేజీ వద్ద కనీసం ఘాట్‌లు కూడా నిర్మించలేదు. దీంతో సంగమేశ్వరుడి తెప్పోత్సవం కూడా నిర్వహించడం లేదు.

- మాజీ ఎంపీ హామీలకూ దిక్కులేదు..

సంగం బ్యారేజీని పర్యాటక కేంద్రంగా చేస్తామని నెల్లూరు ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. హామీ ఇవ్వడం మడమతిప్పడం జగనన్న బాటలో మేకపాటి కుటుంబం ప్రయణిస్తున్నట్లు నియోజకవర్గ ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఏడు దశాబ్దాలు.. మూడు కుటుంబాల ఆధిపత్యం !

- తొలిసారిగా బరిలో కొత్తముఖాలు
- మారనున్న కందుకూరు రాజకీయ ముఖచిత్రం
- మంత్రులు, స్పీకర్‌గా ఇక్కడివారు ప్రాతినిధ్యం


కందుకూరు, ఏప్రిల్ 18: కందుకూరు నియోజకవర్గంలో ఏడు దశాబ్దాల రాజకీయ చరిత్ర మారి కొత్తశకానికి తెరలేచింది. ఈ సెగ్మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రధాన రాజకీయ పార్టీలు కొత్తముఖాలను ఈ ఎన్నికల్లో బరిలో దింపాయి. పార్టీలు ఏవైనా ఈ 70 ఏళ్లకాలంలో మూడు కుటుంబాల మధ్యే రాజకీయం నడిచింది. దివి కుటుంబం వర్సెస్ నలమోతు కుటుంబంగా రెండు దశాబ్దాలపాటు రాజకీయాలు నడిచాయి. అనంతరం దివి కుటుంబం వర్సెస్ మానుగుంట కుటుంబంగా రూపాంతరం చెంది, 50 ఏళ్ల పాటు పెత్తనం సాగింది. ఇరవై ఏళ్ల తమ ప్రాబల్యం చాటుకున్న దివి కుటుంబం, 50 ఏళ్లుగా నియోజకవర్గంపై తమ పట్టు కొనసాగించిన మానుగుంట కుటుంబం తాజా ఎన్నికలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఎన్నో సార్లు ఆయా పార్టీలు ప్రయోగాలు చేసినా ఆ మూడు కుటుంబాలవారే ఎవరో ఒకరు రంగంలో ఉంటూ వచ్చారు. కొత్తవారు రంగంలోకి వచ్చినా ఆ మూడు కుటుంబాలు ఒక్కటై మట్టికరిపించిన చరిత్ర కందుకూరుది.

- కాంగ్రెస్‌కు కంచుకోట

కాగా 2024 ఎన్నికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వైసీపీ అభ్యర్థిగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పోటీచేస్తుండగా, టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు బరిలో దిగారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో పార్టీలకన్నా వ్యక్తులకు, వర్గాలకు ప్రజలు అధిక ప్రాధాన్యం ఇచ్చి గెలిపించారు. ప్రధాన రాజకీయ పార్టీల గాలి బలంగా వీస్తున్న తరుణంలోనూ రాష్ట్రమంతటిది ఓదారి అయితే, కందుకూరుది మరోదారి అన్నట్లుగా ఇక్కడ ఇండింపెండెంట్లను రెండు దఫాలు గెలిపించారు.

- 15 సార్లు ఎన్నికలు

1952లో కందుకూరు నియోజకవర్గం ఆవిర్భవించగా ఇప్పటివరకు 15సార్లు ఎన్నికలు జరిగాయి. రెండేసి సార్లు టీడీపీ, వైసీపీ, స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. 9 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే జయకేతనం ఎగుర వేశారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నల మోతు చెంచు రామానాయుడు విజయం సాధించారు.



1955 ఎన్నికల్లో కాం గ్రెస్ అభ్యర్థిగా దివి కొండయ్య చౌదరి గెలుపొందారు. 1962,67 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నలమోతు చెంచు రామానాయుడు విజయం సాధించారు. 1972లో మానుగుంట ఆదినారాయణరెడ్డి స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిచారు. 1978లో దివి కొండయ్య చౌదరి కాంగ్రెస్ అభ్యర్థిగా, 1983లో స్వతంత్ర అభ్యర్థిగా మానుగుంట ఆదినారాయణరెడ్డి విజేతలుగా నిలిచారు. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదినారాయణ రెడ్డి గెలిచారు. 1989 ఎన్నికల్లో ఆదినారాయణరెడ్డి వారసునిగా రాజకీయ ప్రవేశం చేసిన మాను గుంట మహీధరరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా విజ యం సాధించారు. 1994 ఎన్నికల నాటికి దివి కొండయ్య చౌదరి వారసునిగా డాక్టరు దివి శివరాం రంగంలోకి వచ్చి విజయం సాధించారు. 1999 ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థిగా దివి శివరాం విజయం సాధించారు. 2004, 2009 ఎన్ని కల్లోనూ కాం గ్రెస్ అభ్యర్థి మహీధరరెడ్డి గెలిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన నలమో తు చెంచురామానాయుడు సమీప బంధువు పోతుల రామారావు విజేతగా నిలిచారు. 2019 వైసీపీ అభ్యర్థిగా మానుగుంట మహీధరరెడ్డి విజయం సాధించారు. ఈ దఫా ఆ మూడు కుటుంబాలకు చెందిన వ్యక్తులు బరిలో లేకుండా ఇద్దరూ కొత్తవారే బరిలో దిగుతున్నారు.

ముఖచిత్రం

కందుకూరు నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించిన ఆ మూడు కుటుంబాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి పదవులు వరించటం విశేషం. నలమోతు కుటుంబం, దివి కుటుంబంలోని తొలితరం నేతలే మంత్రులుగా ప్రాతినిధ్యం వహించారు. మానుగుంట కుటుంబాన్ని రెండోతరంలో మంత్రిపదవి వరించింది. దివి కొండయ్యచౌదరి మంత్రిగా ప్రాతినిధ్యం వహించటమేకాగా అసెంబ్లీ స్పీకర్‌గానూ పనిచేశారు. కందుకూరు నెల్లూరు జిల్లాలో అంతర్భాగంగా ఉన్న రోజుల్లోనే జిల్లా నుంచి నలమోతు చెంచు రామానాయుడు 1965 నుంచి 1972 వరకు రాష్ట్ర అటవీశాఖామంత్రిగా పనిచేశారు. జిల్లా విభజన జరిగి ప్రకాశం జిల్లా ఆవిర్భవించాక దివి కొండయ్య చౌదరి 1978-83 మధ్యకాలంలో ఆర్అండ్‌బీశాఖ మంత్రిగా, రెండేళ్ల శాసనసభాపతిగానూ పనిచేశారు. ఇక మానుగుంట కుటుంబం నుంచి ఆదినారాయణ రెడ్డి వారసుడైన మహీధరరెడ్డి 2010-14 కాలంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రిగా పనిచేశారు. దివి కొండయ్య చౌదరి కుమారుడు దివి శివరాం రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేయటమేకాగా 2017 నుంచి 2019 వరకు రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

ముగ్గురు మంత్రులు, స్పీకర్ ప్రాతినిధ్యం

కందుకూరు నుంచి గెలుపొందిన అభ్యర్థులు

సంవత్సరం	విజేత	ప్రత్యర్థి	మొత్తం ఓట్లు	మెజారిటీ
1952	నలమోతు చెంచురామానాయుడు (కాంగ్రెస్)	దివి కొండయ్య చౌదరి(కేఎంపీపీ)	59286	4361
1955	దివి కొండయ్య చౌదరి (కాంగ్రెస్)	రావిపాటి వెంకయ్య (సీపీఐ)	60357	7097
1962	నలమోతు చెంచురామానాయుడు(కాంగ్రెస్)	దివి కొండయ్య చౌదరి(స్వతంత్ర పార్టీ)	67880	1672
1967	నలమోతు చెంచురామానాయుడు(కాంగ్రెస్)	డాక్టర్ వీవై కోటారెడ్డి (స్వతంత్ర పార్టీ)	82561	5912
1972	మానుగుంట ఆదినారాయణరెడ్డి(స్వతంత్ర)	ఎన్. చెంచురామానాయుడు (కాంగ్రెస్)	94258	5433
1978	దివి కొండయ్య చౌదరి(కాంగ్రెస్)	ఎం.ఆదినారాయణరెడ్డి (జనతాపార్టీ)	105692	12305
1983	మానుగుంట ఆదినారాయణరెడ్డి (స్వతంత్ర)	గుత్తా వెంకటసుబ్బయ్య(టీడీపీ)	116376	2841
1985	మానుగుంట ఆదినారాయణరెడ్డి (కాంగ్రెస్)	గుత్తా వెంకటసుబ్బయ్య (టీడీపీ)	128782	1285
1989	మానుగుంట మహీధరరెడ్డి(కాంగ్రెస్)	మోరుబోయిన మాలకొండయ్య(టీడీపీ)	155210	10198
1994	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	మానుగుంట మహీధరరెడ్డి (ఐఎన్‌సీ)	148677	6025
1999	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	మానుగుంట మహీధరరెడ్డి (ఐఎన్‌సీ)	176773	1525
2004	మానుగుంట మహీధరరెడ్డి (కాంగ్రెస్)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	153392	7879
2009	మానుగుంట మహీధరరెడ్డి (కాంగ్రెస్)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	185120	4243
2014	పోతుల రామారావు (వైసీపీ)	డాక్టర్ దివి శివరాం (టీడీపీ)	194679	3806
2019	మానుగుంట మహీధరరెడ్డి(వైసీపీ)	పోతుల రామారావు (టీడీపీ)	218961	14936

భలే భలే బంతి!

- ప్రచారాలకు బస్తాల కొద్దీ కొనుగోళ్లు
- డిమాండ్ పెరగడంతో రెట్టింపయిన ధర

ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుండటంతో అభ్యర్థులు నిర్వహించే రోడ్‌షోలు, బహిరంగ సభలు, ర్యాలీలకు ప్రత్యేక ఆకర్షణగా బంతి పూలను చల్లుతుంటారు. వీటిలో మాలలుగా తయారు చేసి తమ అభిమాన నాయకులు వేస్తుంటారు. గత కొన్ని రోజులుగా అన్ని నియోజకవర్గాలలో అభ్యర్థుల ప్రచారాలు హోరెత్తిస్తుండటంతో నెల్లూరులోని మార్కెట్లో బంతిపూలు కనబడటం లేదు. బెంగళూరు, హొసకోట (కర్ణాటక) ప్రాంతాల నుంచి నెల్లూరుకు నిత్యం బస్సుల్లో ముప్పాతిక శాతం బంతిపూలు దిగుమతి అవుతుంటాయి. పాతిక శాతం పూలు నెల్లూరురూరల్, సంగం, ఇందుకూరుపేట, పొదలకూరు తదితర మండలాల నుంచి అందుతుంది. ఇలా మార్కెట్‌కు వచ్చిన బంతిపూలన రాజకీయ పార్టీల నాయకులు బస్తాల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు. పండగలు, పెళ్లిళ్ల సీజన్లలో ఈ పులు గరిష్ఠంగా కేజీ రూ. 100 ధర ఉంటుంది. కానీ ప్రస్తుతం బంతికి డిమాండ్ ఉండటంతో కేజీ రూ.200ల వరకు ధర పలుకుతోంది. ఇంత ధర ఇస్తామన్నా నెల్లూరు మార్కెట్లో బంతిపూలు చూద్దామన్నలేకపోవడం గమనార్హం

- నెల్లూరు (సిటీ)





బమ్మిని తిమ్మిని చేయడంలో వైసీపీ నాయకులకు మించినవారు లేరు. అయితే ఒక్కోసారి ఇది వికటిస్తుంది కూడా. తిరుపతిలో గురువారం ఇదే జరిగింది. యధారీతిన వైసీపీ ఎన్నికల ప్రచారం 31వ డివిజన్లో సాగింది. వాకిళ్ల ముందుకు వెళ్లి పలకరించడాలు..పూలు చల్లించుకోవడాలూ.. పిల్లల్ని ఎత్తుకుని ముద్దాడడం వంటి సీన్లన్నీ మామూలే. ఆ తర్వాత మీడియాకు ఎన్నికల ప్రచారం సమాచారం రోజూ లాగే పంపారు. కట్టా జయరాం యాదవ్ అనే వైసీపీ నాయకుడు ప్రచారంలో పాల్గొన్నట్టు అందులో పేర్కొన్నారు. రెండున్నరేళ్లుగా వైసీపీ ఛాయలకే వెళ్లకుండా ఉండిపోయిన ఈయన మళ్లీ పార్టీ కండువా ఎప్పుడు కప్పుకున్నాడబ్బా అని అంతా నోరెళ్లబెట్టారు. ఆయన్ని అదే అడిగారు. తన పేరు వాడేసుకుంటున్నారని తెలిసిన కట్టా జయరాం యాదవ్ మాత్రం అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ప్రచారంలో నేను పాల్గొననే లేదంటూ సోషల్ మీడియాలోనే పోస్టులు పెట్టారు. '20 ఏళ్ల భూమన కుటుంబానికి చేసిన సేవలకు జరిగిన మర్యాద మరిచిపోలేకపోతున్నా' అని కడుపు చించుకున్నారు. నా కులానికి న్యాయం చేయమని అడిగినందుకు కుటుంబంలో కలహాలు పెట్టి, పోలీసు కేసులతో వేధించారని.. అటువంటి వాళ్ల కోసం పనిచేయబోనని ఆయన శపథం చేశారు. రెండున్నర ఏళ్లుగా పార్టీకి దూరంగా ఉన్నా తన పేరు ఎలా వాడుకుంటారని ప్రశ్నించారు. ఈ ఖండనతో ఉలిక్కిపడ్డ బులుగు రాతగాళ్లు ముందు పంపిన ప్రకటనను మార్చి ఆయన పేరు తీసేసి మరొక ప్రకటన పోస్టు చేశారు. ఎన్నికల రోజులు కాబట్టి ఇంత సున్నితంగా పేరు మార్చేశారుగానీ, లేకపోతేనా ఇంటి మీదకు బుల్డోజర్లే పంపి ఉండరా అని జనం గుసగుసలు పోయారు.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

అటు ఐదు లక్షలు..ఇటు ఇన్నోవా!



ఎన్నికలన్నాక కాలం నడిచేదంతా నోట్లమీదే కదా! ఐదేళ్లలో ఒక్కసారే ఆఫర్లు ఎగతన్నుకుని వస్తుంటాయి. అలిగినా డబ్బే.. ఆగ్రహించినా డబ్బే! వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలానికి చెందిన వైసీపీ నాయకుడు ఒకరు పార్టీ ఇంచార్జి తీరు పట్ల అసంతృప్తితో కొంతకాలంగా కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. తన అనుచర మిత్రులతో కలిసి టీడీపీలోకి మారిపోవాలనుకున్నారు. ఈనెల 16న ఆనం రాంనారాయణరెడ్డి సమక్షంలో కండువా మార్చుకునేలా నిర్ణయం జరిగిపోయింది. ఈ కార్యక్రమం ఘనంగా జరగాలి కదా అని రూ. 5 లక్షలు కూడా పుచ్చుకున్నారంట. 16న అనుచర బృందం అంతా టీడీపీలో చేరారు కానీ ఆసలాయన జాడ మాత్రం లేదు. ఏం జరిగిందబ్బా అని విచారిస్తే అసలు మందల తెలిసింది. ఎట్నో ఒకట్ల ఆయన్ని వైసీపీలోనే ఉండేలా ఒప్పించారంట. ఒప్పించడం అంటే మాటలతో కాదు చేతలతోనే. అలిగిన అసంతృప్తి నాయకుడి డిమాండ్ ఇన్నోవా వాహనం. సరే.. ఓకే! అనేయడంతో ఈయన టీడీపీ వాళ్లకి జెల్ల కొట్టేశాడు. విషయం తెలిసి.. కండువా కప్పుకోకపోతే పోయింది.. నా ఐదు లక్షలన్నా ఎనక్కి ఇచ్చెయ్యి అని అడిగాడంట. ' అయిదా.. ఇంకా యాడుంది సామీ నా దెగ్గిర.. నేనేమన్నా కొరుక్కు తిన్నానా.. జనానికి ఎప్పుడో పంచేశాను. మిగిలింది ముప్పయి వేలే. కావాలంటే చెప్పు ఎనక్కి ఇచ్చేస్తాను' అని నిజాయితీ మాటలు మాట్లాడడంతో టీడీపీ నాయకుడు తెల్లమొహం వేశాడంట. ఇప్పుడీ సంగతి వెంకటగిరి నియోజకవర్గంలో ఓరల్‌గా ఖలే వైరల్ అవుతోంది. - తిరుపతి,ఆంధ్రజ్యోతి



అట్టుంటనా!

తిరుపతి జన కేతనం



● చెప్పిందంటే.. చేయడంతే!



మన్నవరం భెల్-ఎన్టీపీసీ ప్రాజెక్టు ప్రవేశ ద్వారం



కార్యాలయ భవనం

'మన్నవరం' ఏమైంది జగన్?

పదవీ కాలం పూర్తయినా పత్తా లేని ప్రాజెక్టు

తెరిపిస్తానన్న హామీ నిలబెట్టుకోని సీఎం

అధికారంలోకి రాగానే మన్నవరం పారిశ్రామిక ప్రాజెక్టు పూర్తి చేయిస్తా.

- పాదయాత్ర సందర్భంగా 2018 జనవరి 21న శ్రీకాళహస్తిలో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ. 30 వేల మందికి ఉద్యోగాలు దొరికే భారీ ప్రాజెక్టు కావడంతో ఈ మాటకు జిల్లా ప్రజలు మురిసిపోయారు. ఓట్లన్నీ గంపగుత్తగా వైసీపీకి వేసేశారు. ఆయనైతే అధికారంలోకి వచ్చారు. కానీ, ఐదేళ్లు గడిచినా మన్నవరం ప్రాజెక్టు అతీగతీ లేదు. ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటి? అని పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి కేంద్రాన్ని ప్రశ్నించడంతో సరిపెట్టారంతే.



మెగా ప్రాజెక్టు యాష్ ప్లాంట్

ప్రాజెక్టు స్వరూపం:

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (బీహెచ్ఇఎల్-ఎన్టీపీసీ) వంటి ప్రతిష్ఠాత్మక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు శ్రీకాళహస్తి మండలం మన్నవరంలో విద్యుత్ ఉపకరణాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించాయి. రూ.6500 కోట్ల భారీ పెట్టుబడితో, 30 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించే ఈ భారీ పరిశ్రమను ఎన్టీపీసీ భెల్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట జాయింట్ వెంచర్‌లో నెలకొల్పేందుకు ఒప్పందానికి వచ్చాయి. 2010 సెప్టెంబరు 1న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మన్నవరం వద్ద ఆ ప్రాంతానికి దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరిట వైఎస్ఆర్ పురం అని పేరు కూడా పెట్టారు. ఈ పరిశ్రమకు అనుబంధంగా 30 పరిశ్రమలు కూడా ఏర్పాటవుతాయని అప్పట్లో కేంద్రం ప్రకటించింది. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై శ్రద్ధ పెట్టలేదు. భెల్, ఎన్టీపీసీ సంస్థలు రూ.వంద కోట్ల చొప్పున రూ.200 కోట్లు ప్రాథమికంగా విడుదల చేశాయి. పరిపాలనా భవనం, యాష్ ప్లాంట్, ప్రహరీ నిర్మించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టు పూర్తిగా మరుగునపడిపోయింది. జిల్లాలోని నిరుద్యోగుల ఆశలు ఆవిరయ్యాయి. ఆ సమయంలో తాను అధికారంలోకి రాగానే మన్నవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయించడానికి ప్రయత్నిస్తానని ప్రతిపక్ష నేతగా జగన్ చెప్పిన మాట.. యువతలో ఆశలు నింపింది.

ఎంపీ ప్రశ్నతో సరి

2019 జూన్‌లో జగన్ సీఎం అయ్యాక మన్నవరం ప్రాజెక్టు పూర్తి చేయించేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయలేదు. సంబంధిత మంత్రులతో, ప్రధానితో మాట్లాడలేదు. కనీసం ఎంపీల బృందాన్ని కూడా కేంద్రం వద్దకు పంపింది లేదు. పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి మాత్రం ఒకసారి మన్నవరం ప్రాజెక్టు పరిస్థితి ఏమిటనే ప్రశ్న లేవనెత్తారు. అది తప్ప రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఇంకెలాంటి ప్రయత్నం జరగలేదు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో అధికార పార్టీలో బలమైన నేతలున్నా 30 వేల మందికి ఉద్యోగాలు లభించే ఈ ప్రాజెక్టుపై కనీస శ్రద్ధ పెట్టలేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యంత అవినీతిపరులైన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోకుండా, బదిలీలు కాకుండా సీఎం వేలో పలుకుబడి ప్రదర్శించిన అక్కడి ఎమ్మెల్యే.. పదిమందికీ ఉపయోగపడే ఈ పని గురించి మాత్రం తనకు సన్నిహితుడైన సీఎం జగన్ వద్ద ఏనాడూ ప్రస్తావించింది లేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి రాజకీయాల్లో బలమైన ముద్రగల కుటుంబం మబ్బు కుటుంబం. తిరుపతి ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచిన మబ్బు రామిరెడ్డి ఇప్పుడు లేకపోయినా ఆ కుటుంబం పేరు మాయలేదు. పెదబ్బగా తిరుపతివాసులు ఆత్మీయంగా పిలుచుకునే ఆయన కుమారుడు మబ్బు దేవనారాయణరెడ్డికి మబ్బు యువసేన పేరుతో గట్టి అనుచరవర్గం ఉంది. మున్సిపల్ ఛైర్మన్, ఎమ్మెల్యేగా కూడా గతంలో పోటీచేసిన పెదబ్బ 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. తిరుపతి ఎన్డీఏ అభ్యర్థి ఆరణి శ్రీనివాసుల విజయం కోసం ఉధృతంగా ప్రచారంలో ఉన్నారు.

దొంగ ఓటర్లను తరిమికొడతాం

మబ్బు దేవనారాయణ రెడ్డి



? భూమన అభినయ్ గురించి 'ప్రత్యర్థిగా నథింగ్' అంటూ మీరన్న మాట వైరల్ అవుతోంది. కాస్త ఓవర్‌గా లేదా.

! నిజమే చెప్పాను. 2019లో రాష్ట్రంలో వైసీపీ తుఫాను వీచింది. అప్పుడు కూడా తిరుపతిలో భూమనకి పడ్డ ఓట్లు ఎన్ని? ఎలా గెలిచారు? ప్రభుత్వ వ్యతిరేకత హోరెత్తుతున్న ఇప్పుడు వాళ్లు గెలవగలరా? అందుకే మళ్లీ చెబుతున్నా.. తిరుపతిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాకు నథింగ్.

? ఉప ఎన్నికల్లో లాగే దొంగ ఓట్లు దండెత్తితే మీరేం చేయగలరు.

! పోలింగ్ రోజు ఉదయం 7నుంచే బృందాలుగా పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకుంటాం.దొంగ ఓటు కనిపిస్తే ఉపేక్షించం.ఎంతవరకైనా వెళ్తాం.దొంగ ఓటరు పోలింగ్ బూత్ వద్దకు రావాలంటేనే భయపడేలా చేస్తాం.

? పొత్తులో సీటు కోల్పోయామనే అసంతృప్తి నుంచి టీడీపీ బయటపడినట్టేనా?

! తిరుపతిలో టీడీపీకి బలమైన కేడర్ ఉంది. అయినా పొత్తు నిర్ణయాన్ని గౌరవించాల్సిందే. కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేస్తాం.

● ఫటాఫట్

? వైసీపీలోకి పిలవలేదా

! చాలామందితో రాయబారాలు పంపారు. 1994 ఎన్నికల్లో మా నాన్న మబ్బు రామిరెడ్డికి వ్యతిరేకంగా కరుణాకర్‌రెడ్డి ఒకే పార్టీలో ఉండి పనిచేశారు. 2004లో వైఎస్ఆర్ ముఖ్యమంత్రైన ఆరునెలల్లోనే మమ్మల్ని రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బకొట్టే ప్రయత్నం చేశారు. తిరుమలలోవున్న మా లాడ్జీని కూలదోశారు. అప్పుడు వైఎస్ఆర్‌ని కలిస్తే 'కరుణతో కలిసిపో' అన్నారు. 'అది అసాధ్యం' అని చెప్పేసి, ఎలాంటి పరిహారం తీసుకోకుండా లాడ్జీని టీటీడీకి ఇచ్చేశాం. వాళ్ల కక్ష సాధింపులు ఎంత తీవ్రంగా ఉంటాయో అనేందుకు మాదొక ఉదాహరణ. రాజకీయాలైనా మానుకుంటా గానీ వాళ్లతో కలవను. ఆత్మాభిమానాన్ని చంపుకోలేను.

? భూమనపై స్థానిక రెడ్లలో వ్యతిరేకత ఎందుకు ఉంది

! ఆయన అహంకార ధోరణే అందుకు కారణం. తిరుపతిలో 90 శాతం రెడ్లు ఆయనకు వ్యతిరేకంగా ఉన్నారు.

? మీరు కూడా టికెట్ ఆశించారు కదా

! అవును. అయితే సామాజిక సమీకరణల్లో తిరుపతిలో బలిజలకే సీటు ఇవ్వాలని అధిష్టానం నిర్ణయం తీసుకుంది. అంగీకరించి పనిచేస్తున్నా. పవన్ కల్యాణ్ ఇటీవల తిరుపతి పర్యటనకు వచ్చినప్పుడు మనస్సుకు హత్తుకునేలా మాట్లాడారు. మా పనితీరును చూసి నామినేటెడ్ పదవుల విషయంలో చంద్రబాబుతో కలసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తిరుపతిలో ఎన్డీఏ అభ్యర్థిని గెలిపించుకున్న తర్వాతే పదవి అడుగుతాను.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గూడూరు వైసీపీలో గుబులు



పాశం సునీల్‌కుమార్

మేరిగ మురళీధర్

చిల్లకూరు వేమయ్య

ప్రభుత్వ వ్యతిరేకతకూ తోడైన స్థానికత అంశం

ఐదేళ్లూ జనం మధ్య టీడీపీ అభ్యర్థి సునీల్

అదనపు బలంగా నిలుస్తున్న మిత్రపక్షాలు

● వర్తమానం

గూడూరు అర్బన్, ఏప్రిల్ 18: దశాబ్దం తర్వాత ఖనిజాల గడ్డ గూడూరులో జెండా ఎగురవేయాలని టీడీపీ ఉవ్విళ్లూరుతుండగా సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని వైసీపీ ఆరాటపడుతోంది. అధికార వైసీపీ నుంచి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో ఉమ్మడి కూటమి పక్షాన టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ తలపడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చిల్లకూరు వేమయ్య బరిలో ఉన్నా వైసీపీ, టీడీపీల ముఖాముఖి పోరు జరగనుంది. మునుపటి సానుకూల వాతావరణానికి భిన్నంగా పరిస్థితులుండటం ఈసారి వైసీపీని కలవరపెడుతోంది. అతి ఆత్మవిశ్వాసంతో పార్టీ అధిష్ఠానం ఐదేళ్ల పదవీ కాల పరిమితి ఉన్న ఎమ్మెల్సీ మురళీధర్‌ను బరిలో దించడాన్ని క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. ఈయన అభ్యర్థిత్వంపై అభ్యంతరాలు వ్యక్తమైనా అధిష్ఠానం పట్టించుకోలేదు. ఇక్కడి సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ అభ్యర్థిగా నిలబడటం తలనొప్పిగా తయారైంది. ప్రభుత్వ వ్యతిరేకతకు తోడుగా సిట్టింగ్ ఎమ్మెల్యేనే ప్రత్యర్థితో కలిసి సవాలు విసరడం కూడా వైసీపీ వర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. తమ అభ్యర్థి స్థానికత అంశం ప్రభావం చూపే ప్రమాదముందని కలవరపడుతోంది. అభ్యర్థిలో కలుపుగోలుతనం లేదంటూ పార్టీ శ్రేణులు పెదవి విరుస్తున్నాయి. తగినంత సమయం లేకపోవడం కూడా మురళికి ప్రతికూలాంశం. దీనికితోడు ఇతర పార్టీల నుంచి ఆశించినంతగా చేరికలు లేవు.

టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

ఈ ఐదేళ్లూ నియోజకవర్గంలో అన్ని వర్గాలతో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ మమేకమవుతున్నారు. మిత్రపక్షాలను కలుపుకొని ముందుకెళుతున్నారు. స్థానికత అంశం ఈయనకు బాగా కలిసొస్తుందని పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి. గూడూరు పట్టణంతోపాటు తీర, గ్రామీణ ప్రాంతాలలోనూ సునీల్ కష్టపడి పనిచేస్తూ బలమైన పునాది ఏర్పరుచుకున్నారు. ఇప్పటికే టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో అంశాలు ఆశాజనకంగా ఉండడంతో సునీల్ శిబిరంలో ఉత్సాహం కనిపిస్తోంది. పవన్ అభిమానులతోపాటు నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న కాపు సామాజిక వర్గ ఓట్ల ప్రభావం కచ్చితంగా విజయతీరానికి చేర్చుతుందని సునీల్ నమ్ముతున్నారు. గత ఎన్నికలలో ప్రత్యర్థిగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు ఈసారి ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా ఉండడం కూడా కలిసివచ్చే అంశం.

కాంగ్రెస్ ఓట్లతో వైసీపీకి గండి

కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి చిల్లకూరు వేమయ్యకు పోలయ్యే ఓట్లు తమకు నష్టం కలిగిస్తాయని వైసీపీ వర్గాలలో అంతర్గతంగా ఆందోళన మొదలైంది. గతంలో ఈ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ఆరు సార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. షర్మిల పార్టీ పగ్గాలు చేపట్టాక కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. ఆమె ప్రభావంతో ఏమాత్రం ఓట్లు కాంగ్రెసుకు పోలైనా తమకు గండి పడి నష్టం తప్పదని వైసీపీ నాయకులు చర్చించుకుంటున్నారు.

ఈశాన్యం మంచిదంట

● సెంటిమెంట్



కురుగొండ నుంచి ప్రచారం ప్రారంభిస్తే గెలిచేది గ్యారంటీ అనే నమ్మకం అన్ని పార్టీల అభ్యర్థులనీ ఓజిలి మండలంలో ఉన్న ఈ ఊరికి తరుముతోంది. 2009 దాకా ఓజిలి మండం వెంకటగిరి నియోజకవర్గంలో ఉండేది. ఆ తర్వాత సూళ్లూరు పేట నియోజకవర్గంలోకి మారినాకనే ఈశాన్యం సెంటిమెంట్ తెరమీదకు వచ్చింది. 2009లో అప్పటి టీడీపీ అభ్యర్థి పరసా వెంటరత్నం, కాంగ్రెస్ అభ్యర్థిని విన్నమాల సరస్వతిలు ఇద్దరూ కురుగొండ నుంచే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికలన్నాక ఎవరో ఒకరు ఓడితేనే గదా మరొకరు గెలిచేది. పరసా వెంకటరత్న 5,367 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2019లలో టీడీపీ అభ్యర్థి పరసా వెంకటరత్న, వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యలు కూడా ఈశాన్యం సెంటిమెంటునే పాటించారు. కురుగొండనుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ రెండు పర్యాయాలూ వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య గెలుపొందారు. ఇప్పుడు.. 2024 ఎన్నికల ప్రచారం కూడా టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ, వైసీపీ అభ్యరి కిలివేటి సంజీవయ్యలు ఇద్దరూ కురుగొండ నుంచే చేపట్టారు. సెంటిమెంటు ఎవరిని ఓడిస్తుందో, ఎవరిని గెలిపిస్తుందో తెలుసుకోవాలంటే జూన్ 5 దాకా ఆగాల్సిందే గదా!

- ఓజిలి



ముంచుకొస్తోంది ముహూర్తాల వేళ

తిరుపతి (నేర విభాగం), ఏప్రిల్ 18: ప్రతి పనికీ మంచి ముహూర్తం చూసుకోవడం చాలామందికి అలవాటు. అలాంటిది ఐదేళ్ల పదవీయోగమంటే మాటలా. .దివ్యమైన ముహూర్తం చూడాల్సిందే. అందుకే ఈ ఎన్నికల నామినేషన్ల వేళ నాయకులంతా పురోహితుల వెంట పడుతున్నారు. తిరుపతిలో ఇలా ముహూర్తాలు పెట్టడంలో దిట్టలుగా పేరు మోసిన పురోహితులు దాదాపు ఏడుగురున్నారని సమాచారం. అభ్యర్థులు నమ్మకమైన పురోహితులను ఆశ్రయించి జాతకాలు, చక్రబలం, నామనక్షత్రం చెప్పించుకుంటున్నారు. దీంతో జాతక ఫలాలు చూసేవారికి డిమాండూ పెరిగిపోయింది. ముహూర్తం పెట్టడానికి వీరు రూ.5000 వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా 19వ తేదీ ఉదయం 11.53 నిమిషాల నుంచి 12 గంటల లోపు, 20న ఉదయం 11.49 నిమిషాలు, 22వ తేదీ ఉదయం 11 గంటలకు ముహూర్తం ఫస్ట్ క్లాస్‌గా ఉందని పంచాంగ కర్త శ్రీనివాసాచార్యులు చెబుతున్నారు. అలాగే 23న ఉదయం 11.37 గంటల నుంచి 11.50 లోపు, 24న మధ్యాహ్నం 12.31 గంటలకు, 25న ఉదయం 11.31 నిమిషాలకు నామినేషన్లు వేయడానికి మంచి ముహూర్తాలు ఉన్నాయంటున్నారు.

నాటు..నాటు..నాటు!

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 17 : ఎన్నికల వేళ తిరుపతి జిల్లాలో నాటు ఘాటు గుప్పుమంటోంది. ముఖ్యంగా చంద్రగిరి నియోజకరవర్గంలోని ఎర్రావారిపాలెం, భాకరాపేట, తలకోన అటవీ ప్రాంతాలతో పాటు విజయపురం. జంబాడ, సత్యవేడు, ఊత్తుకోట సరిహద్దు గ్రామాలు, పుత్తూరు, నగరి, తిరుపతి రూరల్ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో విచ్చలవిడిగా సారా తయారవుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ సారాకు డిమాండ్ ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో నిన్నా, మొన్నటి వరకు రోజుకు 10వేల లీటర్లు తయారు చేసేవారు. ప్రస్తుతం 18వేల లీటర్ల వరకు తయారు చేస్తున్నట్లు సమాచారం. తయారీదారులకు అధికార పార్టీ నాయకుల సహకారమందుతోందని తెలుస్తోంది. మద్యం దుకాణాల్లో చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ రూ.300 పలకడంతో కొని తాగలేక పల్లెల్లోని చాలా మంది నాటు వైపు మొగ్గుచూపుతున్నారు. లీటరు రూ.280 నుంచి రూ.300 వరకు దొరకడంతో మందు బాబులు సారా విక్రయ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో పార్టీల అభ్యర్థులు, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు ప్రచారంలో పాల్గొనే వారికి నాటు సారా ఇచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారు. డిమాండ్ పెరగడంతో జిల్లాలో రోజుకు దాదాపు రూ.80 లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. కాగా తాము మాత్రం నాగలాపురం, ఎర్రావారిపాలెం, పుత్తూరు, విజయపురం ప్రాంతాల్లో సారా తయారీపై ఫోకస్ పెట్టామని, దొరికితే వదలి పెట్టే ప్రసక్తే లేదని సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర చెబుతున్నారు.





సారా తయారీ కోసం సిద్ధం చేసిన ఊట, డ్రమ్ముల్లో వున్న ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

వెంకటగిరి, డక్కిలి, ఏప్రిల్ 18: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు పగడ్బందీ చర్యలు తీసుకున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్, వెంకటగిరి ఎన్నికల ఆర్వో ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. యువత నూరుశాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఇక ప్రతి రోజు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంద న్నారు. 25వ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చన్నారు.

తొలి రోజు ఒక నామినేషన్ దాఖలు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గ సార్వత్రిక ఎన్నిలకు సంబంధించి గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి చంద్రముని ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. సూళ్లూరుపేటలో తొలిరోజు ఒక నామినేషన్ దాఖలైంది. వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తొలిసెట్ నామినేషన్ దాఖలు చేశారు. వేనాటి రామచంద్రా రెడ్డి, ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, కట్టా సుధాకర్ రెడ్డి, సుబ్బారావు యాదవ్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆర్వో చంద్రముని వద్ద నామినేషన్ దాఖలు చేశారు.

25వ తేదీ వరకు స్వీకరణ

గూడూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని ఆర్డీవో, ఎన్నికల ఆర్వో కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం సబ్‌కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోటీ చేసే అభ్యర్థి రెండు ప్రాంతాలకు మించి నామినేషన్ వేయకూడదన్నారు. 25వ తేదీనుంచి నూతన ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.


వివరాలు వెల్లడిస్తున్న గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్

వెంకటగిరిలో తొలి నామినేషన్ దాఖలు

వెంకటగిరి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కావడంతో వెంకటగిరిలో గురువారం తొలి నామినేషన్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తన కుమారుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పేరు మీద దాఖలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అందరూ బాగుండాలని, వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు పాడి, పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె కుమారుడు గౌతంరెడ్డి, ఏపూరు కృష్ణ, లక్కమనేని కోటీశ్వరరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి


కోనంగుంటలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

బాలాయపల్లి, ఏప్రిల్ 18: టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ బాలాయపల్లి మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు అన్నారు. మండలంలోని కాలగంద పంచాయతీ కోనంగుంటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద రావును గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4 వేల పింఛనును ఇంటికే వచ్చి అందిస్తామన్నారు. రాయి సత్యంనాయుడు, శ్రీహరి, రాజగోపాల్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ చంద్రబాబుతోనే సాధ్యం

టీడీపీ ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి


సభలో సతీష్‌రెడ్డి, పరసా, అభ్యర్థి విజయశ్రీ తదితరులు

దొరవారిసత్రం, ఏప్రిల్ 18 : రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొని ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలంటే చంద్రబాబు సీఎం కావాల్సి ఉందని తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి అన్నారు. దొరవారిసత్రం మండలం మోదుగులపాళెం, తల్లంపాడు పంచాయతీల్లో మాజీ మంత్రి పరసారత్నం, టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్టీ మండల అధ్యక్షుడు వి.శ్రీనివాసులునాయుడు నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూలేనన్ని హింసాత్మక ఘటనలు, బహుజనులపై దాడులు, అవినీతి, అక్రమాలు నెలకొన్నాయన్నారు. తిరుపతి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సుధాకర్‌రెడ్డి, గోను జక్కురయ్య, షబ్బీర్, జాన్ రమేష్, భాస్కర్, బాలాజీ, శోభన్‌నాయుడు, రవీంద్రనాయుడు తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుల సమావేశం

వాకాడు, ఏప్రిల్ 18: గూడూరు నియోజకవర్గం వాకాడులో టీడీపీ నాయకులతో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు సమావేశమయ్యారు. శనివారం గూడూరులో చంద్రబాబు పర్యటన ఉండడంతో ఈ మేరకు ఏర్పాట్లపై చర్చించారు. ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు కృషి చేయాలని కోరారు. ఆయనతోపాటు మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, నాయకులు దయాకర్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, ప్రమీల, బీజేపీ నాయకుడు పురుషోత్తమరెడ్డి తదితరులు ఉన్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాశిం తదితరులు

గూడూరు, ఏప్రిల్ 18: పట్టణంలోని సీఆర్‌రెడ్డి కల్యాణ మండపం సమీపంలో ఈనెల 20న జరగనున్న టీడీపీ అధినేత చంద్రబాబు సభను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం సభ ఏర్పాట్లను ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన ఉదయం 11గంటలకు మహిళలతో టీడీపీ అధినేత చంద్రబాబు ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. పాశిం వెంట శివకుమార్, చెంచురామయ్య, రహీం, మధురెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, ప్రణీత్, నటశేఖర్, చంద్రమౌళి, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

వస్త్రవ్యాపారులను అన్నివిధాలా ఆదుకుంటాం

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల


కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియకు వినతిపత్రం సమర్పిస్తున్న రెడీమేడ్ వస్త్ర వ్యాపారులు - వెంకటగిరి పట్టణంలోని 16వ వార్డులో టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లక్ష్మీసాయి ప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 18: తనను ఆదరించినట్టే తన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియను ఆదరిస్తే వస్త్ర వ్యాపారులను అన్ని విధాలా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయం వద్ద రెడీమేడ్ వస్త్ర వ్యాపారులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియతో కలిసి ఆయన మాట్లాడారు. వెంకటగిరిని అభివృద్ధి పథంలో నడిపించింది టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అని అన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ... వ్యాపారపరంగా వివిధప్రాంతాల నుంచి వచ్చిన తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయడంతోపాటు, ప్రభుత్వ స్థలంలో వ్యాపార దుకాణాలను నిర్మించి అద్దెకు కేటాయించాలని కోరారు. దీనిపై లక్ష్మీసాయిప్రియ మాట్లాడుతూ... ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. జి.మురళీకృష్ణ, కేవీకే ప్రసాద్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, బి.రాజేశ్వరరావు, ఏ.సత్యనారాయణ, మేరిగ రామకృష్ణ, పి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

చంద్రబాబు బహిరంగసభను జయప్రదం చేద్దాం

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు


సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలంతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు - శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డితో కలసి శ్రీకాళహస్తి పట్టణంలో ప్రచారం చేస్తున్న వరప్రసాదరావు

సత్యవేడు, ఏప్రిల్ 18: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే బహిరంగ సభను ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని తిరుపతి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. గురువారం సత్యవేడు టీడీపీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలాన్ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చంద్రబాబు పర్యటన విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. వైసీపీ దుర్మార్గ పాలనపై సుదీర్ఘపోరాటం చేస్తున్న చంద్రబాబుకు అండగానిలవాల్సిన అవసరం ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌కు బుద్ధిచెప్పేలా ప్రజలను ఆయన సమాయత్తం చేస్తున్నారన్నారు. శనివారం చంద్రబాబు పుట్టిన రోజు కూడా కావడంతో ఈ బహిరంగ సభను అత్యంత భారీగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, బాషా, నిర్మల్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా శ్రీకాళహస్తిలో టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే సుధీర్‌తో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. భారీ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ఇద్దరు వలంటీర్ల రాజీనామా

తడ ఏప్రిల్ 18 : మండల పరిధిలోని కొండూరు సచివాలయ పరిధిలో మిగిలి ఉన్న ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారు. ఈనెల 8వ తేదీ 12 మంది వలంటీర్లు రాజీనామా చేయగా, అప్పట్లో ఇద్దరు చేయలేదు. ఈ క్రమంలో గురువారం ఆ ఇద్దరు రాజీనామా చేయడంతో సచివాలయ పరిధిలో వలంటీరంతా రాజీనామా చేసినట్లు అయ్యింది. ఈ మేరకు ఎంపీడీవో ఆమోస్‌బాబుకు రాజీనామా పత్రాలను సమర్పించారు.

పూరిల్లు పాక్షికంగా దగ్ధం

వాకాడు, ఏప్రిల్ 18 : పట్టణంలోని మసీదువీధిలోని షేక్ అల్లాబాషా పూరిల్లు షార్ట్‌సర్క్యూట్‌తో పాక్షికంగా దగ్ధమైంది. షేక్ అల్లాబాషా కుటుంబసభ్యులు ఉదయాన్నే కూలి పనులకు వెళ్లారు. ఇంట్లో అకస్మాత్తుగా మంటలు రావడంతో గమనించిన చుట్టుపక్కలవారు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సాదాసీదాగా మండల సమావేశం

తడ, ఏప్రిల్ 18: మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తాగునీటి ఎద్దడిపై చర్చించారు. అంత కుమించి ఎటువంటి సమస్యలపై చర్చ జరగలేదు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి, ఉప మండల అధ్యక్షుడు రమేష్, వెంకటేష్, ఎంపీడీవో ఆమోస్ బాబు సహా పలువురు అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువతి మృతి?



గూడూరు, ఏప్రిల్ 18: స్థానిక రైల్వేస్టేషన్‌లో గురువారం గుర్తుతెలియని యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వేస్టేషన్‌లోని ఉత్తరం వైపు ఉన్న యార్డు సమీపంలో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెంది వుండవచ్చని భావిస్తున్నారు. మృతదేహంపై పసుపురంగు డ్రస్ ఉందన్నారు. ఈ మేరకు జీఆర్‌పీ ఎస్‌ఐ కొండప్పనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల తనిఖీలు ముమ్మరం


ఫ్లయింగ్ స్క్వాడ్ హరిప్రియ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికలు కోడ్ అమల్లోకి రావడం, నామినేషన్ల పర్వం మొదలు కావడంతో గురువారం పట్టణంలోని పలు చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీఉ ముమ్మరంగా చేపట్టారు. వల్లివేడు క్రాస్ రోడ్డు సమీపంలో 24 గంటల చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం 7గంటల నుంచి తనిఖీలు ప్రారంభమయ్యాయి. ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కూడా అక్కడ తనిఖీలు నిర్వహించింది. ఎన్నికల నియమావళి కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్వో ధ్యాన్‌చంద్ తెలిపారు. అదే విధంగా రిటర్నింగ్ కార్యాలయం వద్ద హెల్ప్‌లైన్ నెం.08625295015ను అందుబాటులో ఉంచారు. 108 రకాల పోలింగ్ గుర్తులు కూడా నోటీసు బోర్డుల వద్ద అందుబాటులో అతికించారు. ఆర్వో కార్యాలయం వద్ద వంద మీటర్లు మూడు వైపులా పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. దీని పర్యవేక్షణ శ్రీసిటీ డీఎస్పీ చౌడేశ్వరప్ప, సీఐ సంగమేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం

గూడూరు అర్బన్, ఏప్రిల్ 18: రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జి మందా పెంచలయ్య అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శుక్రవారం తిరుపతిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరగనున్న సమావేశానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిని కాంక్షించే కృష్ణమాదిగ ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారన్నారు.

10 మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, ఏప్రిల్ 18 : పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో గురువారం బెల్టు దుకాణానికి తరలిస్తున్న 10 మద్యం బాటిళ్లను ఎస్‌ఐ నాగబాబు స్వాధీనం చేసుకున్నారు. ఆదిశేషయ్య అనే వ్యక్తి మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ప్రలోభాలకు లోను కావొద్దు

చిట్టమూరు, ఏప్రిల్ 18: ఓటు హక్కుని ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకోవాలని మండల ఎన్నికల నియమావళి అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీవో నాగరాజు, సర్వే డీటీ నిరంజన్‌కుమార్‌తో ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో వారు మాట్లాడుతూ... ఓటును మద్యం, నగదుకు అమ్ముకోవద్దని సూచించారు. ఈవోపీఆర్డీ మనోహర్‌గౌడ్, ఏవో సుచేంద్ర ప్రసాద్, ఆర్ఐ, బీఎల్వోలు, వీఆర్వోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చోటివ్వండి


శ్రీలక్ష్మమ్మ కాలనీలో ప్రచారం

కోట, ఏప్రిల్ 18 : నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలంటే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో గురువారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. రాధాకృష్ణారెడ్డి, బాబు, దారా సురేష్, షంషుద్దీన్, తల్లం శ్రీనివాసులు, పోలమ్మ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కోడ్‌ను అమలు చేయాలి

కోట, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు అమలుచేసి చూడాలని ఎంపీడీవో శంకరయ్య కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఎన్నికల నియమావళిపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో దీనిపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం కొక్కుపాడులోని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

టీడీపీలో చేరిన వలంటీర్


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న నెలవల తదితరులు

పెళ్లకూరు, ఏప్రిల్ 18: మండలంలోని పుల్లూరుకు చెందిన ఓ వలంటీర్‌తోపాటు మరో 20 మంది వైసీపీ కార్యకర్తలు గురువారం సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నెలవల వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇటీవల రాజీనామ చేసి టీడీపీలో చేరిన వలంటీర్ బండి మునికుమార్ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు విసిగి పోయామన్నారు. విజన్ ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తే అభివృద్ధి పరగులు పెట్టిస్తారని అందుకే టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేటలో నెలవల విజయశ్రీని గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం నెలవల మాట్లాడుతూ పుల్లూరు వలంటీర్‌తో పాటు మరో 20 కుటుంబాలు టీడీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. చిందేపల్లి గురవారెడ్డి, చెన్నప్పనాటి మునిప్రసాద్, బండి జేసికేంద్రుడు, బండి మునిబత్తెయ్య, బుగ్గా మునిబత్తెయ్య, మునిరత్నం, కనకయ్య తదితరులు పార్టీలో చేరారు. టీడీపీ మండల కన్వీనర్ సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పేరం మధునాయుడు, పి.రాజగోపాల్‌రెడ్డి, వి.శేఖర్‌రెడ్డి, డి.ప్రసాద్‌నాయుడు, కృష్ణమనాయుడు, హరినాయుడు, యుగంధర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రావృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం


పార్టీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 18: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని తూర్పువీధిలోని టీడీపీ నాయకుడు కనుమూరు హరిచంద్రారెడ్డి నివాసంలో పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాశిం మాట్లాడుతూ.. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. అభివృద్ధి మాటను మరిచి రాష్ట్ర సంపదను దోచుకుందన్నారు. అన్ని విభాగాల్లో వెనుకబడిన రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లగలిగే సత్తా ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్‌రహీం, మధుసూదన్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని తిప్పవరప్పాడు, నాయుడుపాళెం గ్రామాలలో సూపర్-6 పథకాలపై పాశిం సునీల్ కుమార్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమిని ఆదరించాలన్నారు. పలువురు పార్టీలో చేరడంతో వారిని ఆహ్వానించారు. వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, కోటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, ప్రశాంత్, ప్రసాద్, హరికృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నెలవల విజయశ్రీ నామినేషన్ దాఖలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 18: టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు టీడీపీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కామిరెడ్డి బెదిరింపులపై ఫిర్యాదు చేస్తాం

మాజీ ఎంపీ నెలవల, మాజీమంత్రి పరసా

పెళ్లకూరు, ఏప్రిల్ 18 : పెళ్లకూరు మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలను నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి బెదిరిస్తున్నారని ఆయన పోకడ ఇలాగే కొనసాగితే ఊరుకోబోమని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి పరసారత్నం హెచ్చరించారు. గురువారం కానూరురాజుపాలెంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కొండూరు యోగేశ్వరరాజుకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండూరు యోగేశ్వరరాజు, దిగువచావాలి టీడీపీ నాయకుడు నేలవల్లి సిద్దులయ్యనాయుడిని సత్యనారాయణరెడ్డి ఫోన్‌లో బెదిరించడం భావ్యం కాదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.166 కోట్లతో స్వర్ణముఖి నదికి కరకట్టలను నిర్మిస్తే చిల్లకూరు వద్ద వాటిని ధ్వంసం చేసి తమ పొలాలకు నీరు తరలించారన్నారు. పేరం రమేష్‌నాయుడు, చింతా సతీష్‌చంద్ర, గాలి రమేష్‌నాయుడు, వెంపళ్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ముగిసిన నవమి వసంతోత్సవాలు

పట్టాభిషేక అలంకారంలో స్వామివారు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 18: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి వసంతోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజు స్వామివారు పట్టాభిషేకం అలంకారంలో భక్తులను కటాక్షించారు. అనంతరం రాత్రి స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా సూళ్లూరుపేటకు చెందిన ఓలేటి బాల సత్యనారాయణ, నాగలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఉదయం స్వామివారికి అభిషేకానంతరం పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కోట/ సూళ్లూరుపేట/ చిల్లకూరు, ఏప్రిల్ 18 : పట్టణంలోని ప్రగతి విద్యాసంస్థల్లో గురువారం అగ్నిమాపక అధికారి హరీష్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన జరిగింది. హఠాత్తుగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. సూళ్లూరుపేట పట్టణంలోని పెట్రోలు బంకులు, ఇండచ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక అధికారి రఘునాథ రెడ్డి అవగాహన కల్పించారు. చిల్లకూరు మండలంలోని తిరుమల పాలపరిశ్రమలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారి చలమయ్య సిబ్బందితో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించారు.

12 మంది బైండోవర్

కోట, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని చెందోడులో పలు కేసులకు సంబంధించి 12 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. ఆయా వ్యక్తులను తహసీల్దారు నాగరాజరావు ముందు బైండోవర్ చేయగా ఆయన ఎన్నికల నియమావళిని వివరిస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారు.